# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 25-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:248 పేజీలు:6 వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

చైనా చీమలు
కాటు విషపూరితం
భయంతో జనం.

హంటా వైరసు
వేట మొదలైయింది
మాస్కులే అండా.

స్వదేశి మేవ
మనరూకకు చేవ
ప్రగతి తోవ.

విద్యా సుగతి
నీటుతప్పని స్థితి
ఇదీ సంగతీ.

పసిడి సుంకం
తగ్గదు దాని బింకం
విశ్వాభరణం.



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు
ఎవరిది మూలమలుపు ?
ఇది వెనుకకా ముందుకా
మెట్రో కొత్త మలుపు !
నూనె లేదు వత్తి లేదు
వెలుగు దివ్వె ఆరిందా ?
ఆలి లేదు చూలి లేదు
కొడుకు పేరు గోవిందా ?



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# మియాపూర్‌లో హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

**–పెద్దా కుడి సరస్సు వైపు అదనపు పైప్‌లైన్ నిర్మాణానికి ఆదేశాలు**
**–హెచ్‌డీఎఫ్‌సీ జంక్షన్ కల్వర్టులో పూడికతీత, డ్రైనేజీ పునరుద్ధరణ**
**–భవిష్యత్తులో నీటి నిల్వలు నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిన హైడ్రా అధికారులు**



హైదరాబాద్,జూన్ 24: ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో మియాపూర్‌లో వరద ప్రభావిత ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ పరిశీలించారు. వర్షపు నీటి పారుదల వ్యవస్థను మెరుగు పరచడంతో పాటు భవిష్యత్తులో వరద సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పరిశీలన సందర్భంగా పెద్దా కుడి సరస్సు వైపు వరద నీరు వేగంగా, సజావుగా ప్రవహించేలా అదనపు వర్షపు నీటి పైప్‌లైన్‌ను అత్యవసరంగా నిర్మించాలని కమిషనర్ సూచించారు. భారీ వర్షాల సమయంలో నీటి నిల్వలు తగ్గించి వరద ముప్పును నివారించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

**హెచ్‌డీఎఫ్‌సీ జంక్షన్ వద్ద పూడికతీత పనులు**

మరోవైపు, మియాపూర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ జంక్షన్ కల్వర్టు వద్ద పూడికతీత పనులు చేపట్టారు. డ్రైనేజీ వ్యవస్థలో పేరుకుపోయిన మట్టి, చెత్తను తొలగించి వర్షపు నీరు అడ్డంకులు లేకుండా ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నారు. డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి.

**భవిష్యత్తులో నీటి నిల్వలకు చెక్**

వర్షాకాలంలో రహదారులు, కాలనీల్లో నీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. వర్షపు నీటి ప్రవాహాన్ని మెరుగుపరచడం ద్వారా వరద ప్రభావాన్ని తగ్గించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వం భట్టి విక్రమార్క

ఖమ్మం, జూన్ 24: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈరోజు(బుధవారం) వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరమ్మ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరలేదని గుర్తుచేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పది సంవత్సరాలలోనే కుంగిపోయిందని భట్టి విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీతో చెల్లిస్తోందన్నారు. తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు మాయమాటలతో రాష్ట్రంలో తిరుగుతున్నారని.. ప్రజలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుతూ వచ్చామని తెలిపారు.

కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా ఇస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు 22 వేలకోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా కింద వేలకోట్ల రూపాయలు చెల్లించామని తెలిపారు. మహిళల ఉచిత బస్సుకు 13వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 'సర్' ప్రమాదకరమైందని అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. పోలింగ్ సిబ్బందికి సమగ్రమైన సమాచారం అందించాలన్నారు. జూన్ 30వ తేదీన మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

రెండున్నర సంవత్సరాల కాలంలో రైతు భరోసాకు 36 వేల కోట్ల రూపాయలు అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిది అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అవసరమైన ఎరువులను అందించామని చెప్పారు. ఈ నెల 30వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. రైతులను ఆదుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూత సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.






# SIR విషయంలో ఎవరినీ ఉపేక్షించం..

## –ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్



హైదరాబాద్, జూన్ 24: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) అంశాన్ని కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ నేతలకు సూచించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జూమ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు సహా పార్టీ ముఖ్య నేతలంతా ఈ సమావేశానికి హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి ఎస్ఐఆర్ అంశం చాలా సీరియస్ విషయమని, పార్టీ నాయకులంతా మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కొందరు నాయకులు ఈ అంశంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వైఖరి పార్టీకి నష్టం కలిగిస్తే సహించబోమని హెచ్చరించారు. జిల్లాల వారీగా అవగాహన సదస్సులపై నివేదికలు తమ వద్ద ఉన్నాయని, కాంగ్రెస్ తరఫున మరిన్ని సదస్సులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. ఇంచార్జ్ మంత్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సరిగా పని చేయకపోతే పేద ప్రజలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు.

పేదల ఓట్లు తొలగిపోతే వారి హక్కులు దెబ్బతింటాయని, ఆధార్, రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాలపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితి రాకుండా పార్టీ నాయకులు గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పార్టీ ఆదేశాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసిన సీఎం, ఆదేశాలను పట్టించుకోని వారి స్థానంలో కొత్త ఇంచార్జ్‌లను నియమిస్తామని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించబోమని, పని చేయకుండా పార్టీకి నష్టం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాబోయే 10 రోజులు కీలకమని పేర్కొన్న సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ సర్పంచ్‌లు, స్థానిక నాయకులతో కలిసి గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి ఎస్ఐఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దీంతో ఒక్క అర్హుడి ఓటు కూడా కోల్పోకుండా చూసుకోవాలని నేతలకు దిశానిర్దేశం చేశారు.

# డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్నాం: ఎంపీ రఘునందన్ రావు



సిద్దిపేట, జూన్ 24: డ్రగ్స్ నిషేధానికి ప్రతి జూన్ 23వ తేదీన ఒలింపిక్ డేను నిర్వహిస్తున్నామని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. నశాముక్త భారత్ కింద మళ్లీ ఈ ర్యాలీ చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈరోజు (బుధవారం) సిద్దిపేట పట్టణంలో డిగ్రీ కళాశాల మైదానంలో ఒలింపిక్ రన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు పాల్గొని మాట్లాడారు. ఈ రన్‌లో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ ఒలింపిక్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలను ఎండలో ఉంచడానికి తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని చెప్పుకొచ్చారు. డీ విటమిన్ కోసం ఒక ట్యాబ్‌లెట్ వేస్తున్నారు కానీ ఎండలో మాత్రం ఉంచట్లేదని తెలిపారు. యోగాతో ఆరోగ్యంగా ఉంటారని వివరించారు.

**యోగా చేయడం అలవాటు చేసుకోవాలి..**

యోగా చేయడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. స్కూల్ యాజమాన్యాలు విద్యార్థులకు యోగా నేర్పించాలని సూచించారు. ఒలింపిక్స్ క్రీడలను తాము చిన్నపుడు చూసేదని.. ఇండియాకి ఎన్ని కప్పులు వచ్చాయో అని తెలుసుకునే వాళ్లమని అన్నారు. ఎప్పుడు కూడా చైనా ఒలింపిక్స్‌లో మొదటగా వచ్చేదని.. మనం మాత్రం కింది స్థానంలో ఉండే వాళ్లమని వెల్లడించారు. నరేంద్ర మోదీ ప్రధాని అయిన తర్వాత క్రీడలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.

**క్రీడలు అలవాటు చేయాలి..**

తల్లిదండ్రులు పిల్లలకు క్రీడలు అలవాటు చేయాలని ఎంపీ రఘునందన్ రావు సూచించారు. స్వామి వివేకానంద చెప్పినట్లుగా మన దేశానికి కావాల్సింది భగవద్గీత పుస్తకాలు కాదని.. క్రీడా మైదానాలు కావాలని అన్నారు. మన దేశంలో ఉన్నా క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. సిద్దిపేటకు ఇంత పెద్ద గ్రౌండ్ ఉండటం చాలా అదృష్ట మని.. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

# జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం చంద్రబాబు

కర్నూల్, జూన్ 24: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు (బుధవారం) కర్నూలు జిల్లాలోని జొన్నగిరిలో పర్యటించి, ప్రతిష్ఠాత్మకమైన 'జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు'ను ప్రారంభించారు.

ఈ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు కర్నూల్ జిల్లాలో ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ ఏపీ ఆర్థికాభివృద్ధిని పరుగులు పెట్టించడంలో అత్యంత కీలక పాత్ర పోషించనుందని ప్రభుత్వం భావిస్తోంది.

**యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు..**

ఈ మైనింగ్ ప్రాజెక్ట్ ద్వారా రాయలసీమ ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం కావడంతో పాటు, స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

ఏపీలో పారిశ్రామిక వృద్ధికి, మైనింగ్ రంగానికి ఈ ప్రాజెక్ట్ ఒక కొత్త దిక్సూచిగా మారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడనుంది. జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి గేమ్ ఛేంజర్‌గా మారబోతోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పెట్టుబడులు, ఉత్పత్తి లక్ష్యాలు, ప్రత్యేకతల వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

మొత్తం పెట్టుబడి: ఈ ప్రతిష్ఠాత్మక బంగారు గనుల ప్రాజెక్టు కోసం రెండు ప్రముఖ మైనింగ్ సంస్థలు కలిసి రూ. 405 కోట్ల భారీ పెట్టుబడి పెట్టాయి.

నిర్వహణ సంస్థలు: జియోమైసూర్ సర్వీసెస్, డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థలు సంయుక్తంగా ఈ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును చేపట్టాయి.

**మూడు దశల్లో బంగారు ఉత్పత్తి లక్ష్యాలు..**

జొన్నగిరి మైనింగ్ క్షేత్రంలో బంగారు ఉత్పత్తిని దశలవారీగా పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

తొలి దశ: ఏడాదికి 400 కేజీల బంగారు ఉత్పత్తితో మైనింగ్ ప్రారంభం కానుంది.

రెండో దశ: తదుపరి కాలంలో దీనిని ఏడాదికి 900 కేజీలకు పెంచుతారు.

తుది దశ: ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలోకి వచ్చాక ఏడాదికి ఏకంగా 2 టన్నుల బంగారం ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

**మహిళలు, యువతకు ప్రత్యేక శిక్షణ..**

ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానికులకు కేవలం ఉపాధి కల్పించడమే కాకుండా, వారిని నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు.

మైనింగ్ జరిగే ప్రాంతంలో వాడే అత్యంత భారీ వాహనాలను సురక్షితంగా నడిపేందుకు వీలుగా 'సిమ్యులేటర్ యంత్రాల' సహాయంతో స్థానిక మహిళలకు, యువతకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణా కేంద్రాన్ని సీఎం చంద్రబాబు స్వయంగా సందర్శించి, అభినందించారు. అనంతరం సీఎం చంద్రబాబు జెండా ఊపి ఖనిజంతో కూడిన మట్టిని తరలించే భారీ వాహనాలను ప్రారంభించారు. ఈ చారిత్రాత్మక మైనింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పారిశ్రామిక శాఖ మంత్రి టీజీ భరత్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**చురక**

మెట్రో రైలు చర్చలన్నీ
మొత్తానికి ఫలప్రదం
అమలు జరిగినప్పుడే
అభివృద్ధి జయప్రదం
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల
కలహాలకు అనుమానం
అదే జరిగి అటుకెక్కితే
అందరికీ అవమానం



-వేల్పుల నారాయణ
9440433475

**రాధశ్రీ రాగాలు**

మదిన కదలును తలపు
మరువ రానిది వలపు
కలివిడియె కలగలుపు
అనును రాధశ్రీ !!
నవ్వనెడి యోగమ్ము
తొలగించి యోగమ్ము
కలిగించు భోగమ్ము
అనును రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210

# ఈద్గా ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీహరి



నారాయణపేట్, జూన్ 24: ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, కులమతాలకు అతీతంగా మక్తల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తమ లక్ష్యమని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మక్తల్ పట్టణంలోని ఈద్గా వద్ద రూ.36 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 73 ఏళ్ల తర్వాత మక్తల్ ప్రాంత ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టమని అన్నారు. ప్రార్థనా మందిరాల అభివృద్ధి, సంరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. మక్తల్ ప్రాంతం అన్ని రంగాల్లో వెనుకబడిందని, దానిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని కులాలు, మతాల ప్రజలు సమానంగా అభివృద్ధి చెందాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

కులాలు, మతాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని మంత్రి పిలుపునిచ్చారు. ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు ఉంటాయని, ఇప్పుడు అందరి దృష్టి మక్తల్ అభివృద్ధిపైనే ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హన్మంతు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ రవికుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మల్లారెడ్డి యూనివర్సిటీలో ఘనంగా 3వ కాన్వొకేషన్ వేడుకలు




మేడ్చల్, జూన్ 24: మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో బుధవారం 3వ కాన్వొకేషన్ డే (గ్రాడ్యుయేషన్ డే) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వివిధ విభాగాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలను అందజేశారు. విశిష్ట ప్రతిభ కనబరిచిన టాపర్లకు గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలు ప్రదానం చేసి అభినందించారు.


ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన మల్లారెడ్డి, లక్ష్యాలను ముద్దాడుతూ భవిష్యత్తును జయించాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, నేటి పోటీ ప్రపంచంలో నిరంతరం నేర్చుకునే తత్వం, పట్టుదల ఉన్నవారికే విజయం దక్కుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చడంతో పాటు సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టాలు అందుకున్న విద్యార్థుల ఆనందోత్సాహాలతో యూనివర్సిటీ క్యాంపస్ పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

# ముంబైలో భారీ వర్షాలు.. అంధేరిలో సబ్‌వే మూసివేత

ముంబై, జూన్ 24: మహారాష్ట్రలోని ముంబైలో నైరుతి రుపవనాల ప్రవేశంతో వర్షాలు దంచికొడుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో.. అత్యంత రద్దీగా ఉండే అంధేరి సబ్‌వేలో వరద నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు అండర్‌పాస్‌ను పూర్తిగా మూసివేశారు. సబ్‌వే మూసివేయబడటంతో ట్రాఫిక్ జామ్‌లను నివారించడానికి ట్రాఫిక్ పోలీసులు అదనపు సిబ్బందిని మోహరించి వాహనాలను ఇతర మార్గాల ద్వారా మళ్లిస్తున్నారు.


వరద నీటిని తొలగించడానికి బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది డీవాటరింగ్ పంపులను ఉపయోగించి నీటిని బయటకు పంపుతున్నారు.

24 గంటల వ్యవధిలో మహానగరంలోని కొన్ని ప్రాంతాల్లో 200 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. రాబోయే 24 గంటల్లో ముంబైశివారు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) తెలిపింది. కుండపోత వర్షాల నేపథ్యంలో అవసరమైతే తప్పా ప్రజలు బయటికి రావొద్దని అధికారులు సూచించారు.

## కంటి వెలుగులు..!!

మొదలెక్కడో చివరెక్కడో
పెద్ద ఆక్టోపస్ మహా నగరం!
గల్లీ గల్లీ తిరిగి తిరిగి చూస్తే
అడ్రస్ గల్లంతై వస్తుంది జ్వరం!.
ఎంత విశాలమో అంత సుందరం
కొండ చిలువలా పయ్యారం దారి!
ఇక తికమక పడక సీదా వెళ్ళాలి
చిక్ బుక్ చిక్ చక్కని రైలు చేరి!



-మరికంటి
9640407103

## కవి కాలం...!

కుప్పి గంతులెందుకు
మారవోయి మారుతి
కాలం ఎప్పుడూ ఆగదు
వస్తోంది చూడు నైరుతి..!
మంచి మాటలతోనే
ఇస్తారు నీకు హారతి..
సర్వ సత్తాక ప్రజాస్వామ్య
గణతంత్ర రాజ్యమే భారతి..!!



-డా.కటుకోఝ్వల రమేష్
సెల్:9949083327

## ఓనమాలు దిద్దినప్పుడు..!

నాడు పలకమీద బలపంతో
ఓనమాలు దిద్దినప్పుడు
అవి కేవలం గీతలే అనుకున్నాను
గుండ్రని సున్నాలకు
చెవులు, కొమ్ములు తగిలించినప్పుడు
సరదా ఆటలే అనుకున్నాను.

ఆ చిన్న గీతలే ఒక రోజు
నా జీవిత రేఖలవుతాయని తెలియదు.
'అ, ఆ, ఇ, ఈ..' అంటూ
నోటి నిండా ఉచ్ఛరించినప్పుడు
ఆ అక్షరాలు చేసే సవ్వడిని
ఏదో ఓ కొత్త శబ్దం అనుకున్నాను
కానీ అదే
సవ్యమైన నా జీవన సరళికి
అదొక అద్భుత నినాదమవుతుందని
తెలుసుకోలేకపోయాను.

అక్షరాలు నేర్చుకునే పసి వయసులో
వాటి ప్రయోజనం తెలియదు
విత్తనానికి కూడా ఏం తెలుసు
నాటిన పిదప తానొక
మహా వృక్షంగా ఎదుగుతానని?
అప్పటి బాల్యానికి ఎలా తెలుస్తుంది
'అమ్మ' అనే పదం
కన్నీళ్లు తుడిచే ఓదార్పు అవుతుందని?
'నిజం' అనే పదం
జీవితాన్నంతా ధైర్యంగా నడుపుతుందని?
'ప్రేమ' అనే పదం
మనిషిని మనీషిగా మారుస్తుందని?.





వెనక్కి తిరిగి చూస్తే ఇప్పుడనిపిస్తుంది
ఓనమాలు దిద్దడం
కేవలం అక్షరాభ్యాసం కొరకే కాదని
మనిషిని మృగం నుంచి
మనీషిగా మార్చడానికి
మొదటి మెట్టు వేయడమని.
మొదటి జన్మ తల్లి ఇస్తే
అక్షరం ఇచ్చిన రెండో జన్మ
జ్ఞానాన్ని ఇస్తుంది.
అందుకే...
ఘంటాపథంగా ఇప్పుడు చెబుతున్నా
పలకపై నాడు దిద్దిన ఆ చిన్న 'అ'
నేటి నా నాగరికతకు
మొదటి ఊపిరయ్యిందని
నా ఆత్మకు
తొలి మేల్కొల్పుగా నిలిచిందని!



- ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

## అందెశ్రీకి కవుల అక్షరాంజలి





-రామ్ లలితారెడ్డి
9704699726

ఈ సంకలనానికి **'ఆత్మగల్ల పాట'** అంటూ అందెశ్రీ సాహిత్య కృషి గురించి సంపాదకులు డాక్టర్ తిరునగరి శ్రీనివాస్ రాసిన సంపాదకీయం అక్షర సత్యం అనిపిస్తుంది. **"ఒక మనిషి పుట్టటం గొప్ప కాదు, ఆ పుట్టుకకు కారణం తెలుసుకొని అందరూ మెచ్చేలా కాల ధర్మం చేయడమనేదే గొప్ప విషయం".** అలా కోట్లాదిమంది హృదయాలను గెలుచుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి లోకకవి అందెశ్రీ 1961 జూలై 18న జన్మించారు. అందెశ్రీ బడికి వెళ్లకుండా పశువులు కాపరిగా మారి అందె ఎల్లయ్యగా గ్రామంలో అందరికీ తలలో నాలుకలా ఉండేవారు. తాపీమేస్త్రిగా పనిచేస్తూనే ఆధ్యాత్మికతతో కూడిన తాత్విక చింతనతో బాల్యం నుండే అనేక పాటలను, తత్వగీతాలను రాసి పాడి వినిపించేవారు. ఆ పాటలు విన్న శృంగేరి మఠానికి చెందిన శంకర్ మహరాజ్ ఆయనని చేరదీసి ప్రోత్సహించారు. జీవితమిచ్చే అనుభవం ద్వారా కాలం మలిచిన కవిగా మంచి గాయకునిగా పేరు ప్రఖ్యాతుల్ని పొందారు. **"మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు"** అని నేడు మనిషిలో మానవత్వం ఎలా కొరవడుతుందో అన్న విషయాన్ని పాట ద్వారా జనుల గుండెల్లోకి నేరుగా పంపించిన సవ్యసాచి అందెశ్రీ. తెలంగాణ రాష్ట్ర గీతమైన **"జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం"** ఆయనకు ఎంతో కీర్తి ప్రతిష్టలను తీసుకొచ్చింది. అందెశ్రీ సాహిత్య సేవకుగాను దేశ విదేశాల్లో ఎన్నో సత్కారాలను, బిరుదులను పొందారు. తెలంగాణ ప్రాంత ప్రజల భావజాలాన్ని నరనరాల్లో నిక్షిప్తం చేసి వారి హృదయానికి దగ్గరగా ఉన్నటువంటి పాటలను రాసి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.


10 నవంబర్ 2025 న అందెశ్రీ మరణించడం సాహితీ లోకానికి తీరని లోటుగా చెప్పవచ్చు. ఒక ముఖ్యమంత్రి అందెశ్రీ పాడెను మోసి నివాళులర్పించారంటే ఆ మనిషి గొప్పతనం మాటల్లో చెప్పలేనిది. ఇంతకంటే అరుదైన గౌరవం ఏ కవికి దక్కదని చెప్పవచ్చు. అటువంటి అందెశ్రీ గురించి, ఆయనతో వారికి ఉన్న అనుభవాలను స్మరిస్తూ దాదాపు 67 మంది కవులు ఆయనకు కవితలతో **'జన గీతిక'** సంకలనంలో అక్షర నివాళిని అర్పించారు. కదిలించే పాట పదునైన మాట లోకంలో ఉన్నంతకాలం అందెశ్రీ సాహిత్య సేవకు శిఖరాయమానమై నిలుస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ పుస్తకంలో ప్రతి కవిత ఒక అద్భుతమైన రసగుళిక. ఆయన పుట్టిన నుండి మరణించినంతవరకు ఎంతో అద్భుతంగా ఒక్కొక్కరు ఒక్కో రీతిగా కవితలు రూపంలో ఆవిష్కరించారు.

**'లోక కవికి అశ్రునివాళి'** పేరుతో ప్రొఫెసర్ బాణాల శ్రీనివాసరావు తన అనుభవాలను అద్భుతమైన కవితగా మలిచిన తీరు ఆలోచింప చేస్తుంది. 'కాంతిపాటై' అంటూ ఫిజిక్స్ అరుణ్ కుమార్ కాలం గుండెల్ని చీల్చుతూ మట్టి కిరణాల ప్రవాహమై మన గుండెల్లో కవనోదయ కాంతిపాటై ప్రతిధ్వనిస్తున్నారంటూ అందెశ్రీ సాహిత్య ప్రస్తానాన్ని గురించి అద్భుతంగా వర్ణించిన తీరు ఆలోచింపచేస్తుంది. **'స్వరఝరి అందెశ్రీ'** అంటూ సంధ్య సుత్రావె కొమ్మ చెక్కితే బొమ్మరా కొలిచి మొక్కితే అమ్మరా ఆదికే ఇది పాదురా కాదంటే ఏదీ లేదురా అంటూ అందెశ్రీ కవి గురించి చక్కగా వివరించారు. **'అమరుడాయెను'** కవిత శీర్షికతో కమలశ్రీ రాసిన కవిత అందెశ్రీ జీవిత ప్రయాణాన్ని వెల్లడి చేసింది. 'మాయమైపోయినాడమ్మ' శీర్షికతో మాధవి అందెశ్రీ లాంటి ఓమహావృక్షము ఈ ప్రపంచం నుండి ఎలా మాయమైపోయిందనే విషయాన్ని తెలిపారు.

డి.జ్యోతి 'సాహితీ శిఖరం' కవిత శీర్షికతో తెలంగాణ కోల్పోయిన ఓ సాహితీ శిఖరం గురించి అతని సేవలను గురించి కొనియాడుతూ చెప్పిన తీరు పాఠకుల్ని ఆలోచింప చేస్తుంది. **'సాల్యూట్'** కవిత శీర్షికతో వాండ్రంగి కొండలరావు రాసిన కవిత నిజమైన సాహితీ వేత్తకు చేసిన ఓ గొప్ప సాల్యూట్ గా అభివర్ణించవచ్చు. **'శాశ్వతం'** కవిత శీర్షికతో శోభారాణి రాసిన కవిత ఓ మనిషి మంచితనానికి మారుపేరైతే కష్టేఫలి అన్నట్లు బ్రతికితే ఆ మనిషి చిరునామా శాశ్వతముగా జనుల గుండెల్లో ఎలా నిలిచి ఉంటుందనే విషయాన్ని తెలియజేశారు.

'ఎల్లలు లేని' కవితా శీర్షికతో స్వర్ణలత రాసిన కవిత నిజంగా కవికి తన పుట్టిన గ్రామంలోనే కాదు దేశ విదేశాలలో నలువైపులా హద్దులు అనేవి తన రచనలకు ఉండవనే విషయాన్ని ఎంతో చక్కని పదజాలంతో తెలియజేశారు.

**'అక్షర యోధుడు'** శీర్షికతో గన్నవరం వెంకటేశ్వర్లు రాసిన కవిత నిజంగా అక్షరం కోసమే జన్మించి అక్షరం కోసమే తన చివరి శ్వాస వరకు పోరాటం చేసిన యోధుడిగా అందెశ్రీ జీవిత ప్రయాణాన్ని అద్భుతమైన కవిత రూపంలో వర్ణించిన తీరు ఎంతగానో ఆలోచింప చేస్తుంది. ఇలా అనేక మంది కవులు అనేక విధములుగా అందెశ్రీ గారి ప్రతిభ పాటవాలను తమ కవితలతో అక్షర నివాళి చేస్తూ తన కీర్తి శాశ్వతంగా పుస్తక రూపంలో నిక్షిప్తం చేయడమే కాకుండా, భావితరాలకు ఒక గొప్ప రచయితను గురించి తెలియజేయడం అనే సంకల్పంతో ఈ పుస్తక ముద్రణ జరిగింది. ఈ పుస్తకాన్ని ఈ కవితల్ని పుస్తక రూపంలో తీసుకువచ్చిన సంపాదకులు డాక్టర్ తిరునగరి శ్రీనివాస్ కృషి అభినందనీయం. కొరవడుతున్న మానవత్వానికి మళ్లీ జీవం పోయాలన్న తపనతో తన సాహిత్య ప్రస్థానాన్ని సాగించి ముగించిన అందెశ్రీకి కవులు అర్పించిన ఘనమైన కవితాక్షర నివాళి ఈ **'జన గీతిక'** అందరూ చదివి దాచుకోదగిన సంకలనం. ●



పుస్తక సమీక్షలు


## కోకిల రెక్కలనిండా వెలుగుతున్న ఓ కవి తెలుగు పద్యం



కోకిల చూడటానికి రంగులో నలుపేకాని, నాలుగు దిక్కులు మెచ్చిన గొప్ప స్వరం దాని సొంతం. వలస వచ్చిన పక్షిగా దాని గుర్తింపుకు చరిత్రలో గట్టిగా ముద్రలు ముద్రించబడ్డా, రోజూ ఉదయాన్నే సరిగమల గమకాలతో ఆహ్లాదంగా ప్రపంచాన్ని మనసారా పలకరించే సంగీత స్వరూపిణీ 'కోకిల'. హాయిగా వినిపించే దాని స్వరాల లక్ష్యం కేవలం తెల్లారుతోందని నిన్ను నిద్ర లేపటానికి మాత్రమే కాదు. రోజంతా నీకు శుభాలు కలగాలని, అన్నిట్లో నువ్వు జయించాలని, గట్టిగా ప్రార్థన చేస్తున్న నీ అద్వితీయ మంచి మిత్రుడు కోకిల. మనుషులకు అపకారం చేసే విషతుల్య ఫలాలను తాను భుజించి మానవలోకానికి మహోపకారాన్ని అందిస్తున్న ఓ కరుణామయి స్వరూపమే కోకిల.

మన తెలుగు సాహిత్యంలో మరి యు భారతీయ సంస్కృతిలో తన ప్రాధాన్యతను కొనసాగిస్తున్న కోకిల ఒకరోజు ఉదయాన్నే ఆచార్య మసన చెన్నప్పగారి గుమ్మం ముందు నిలబడి శబ్దం చేసిందట. తలుపు తీసిన ఆచార్యుల వారు ఆశ్చర్యపడి కోకిలను లోపలికి ఆహ్వానించాడట. వచ్చి కూర్చున్న కోకిల తనకు చాలా పాటలు వచ్చునని, పద్యాలు నేర్చుకోవాలని ఎంతోకాలంగా ఆశగా వుందంటూ తన మనసులోని మాట ను గురువు గారి ముందు వుంచింది. ఎన్నో వందల మందికి పద్యాలు నేర్పిన మహా గురువు మసన చెన్నప్పగారు సరేనని ఆ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారట. ఆ నేపథ్యం నుండి పురుడు పోసుకున్న గొప్ప కావ్యమే 'కోకిల' (పద్యకృతి). ఆయన మాటల్లోనే చెప్పుకున్నట్లు ఇది ఆయన స్వీయానుభూతి నేరుగా పద్యాలలోకి తర్జుమా కాబడిన సాహిత్య సందర్భమిది. ఆత్మాశ్రయ రీతికి అద్భుతమైన రూపాన్ని అందించిన పద్య చాతుర్యానికి చమత్కారమైన శిల్పరూపమే ఈ రచన.

ఈ గ్రంథం ద్వారా మానవ జాతి జీవన విధానానికి అవసరమైన నియమ నిబంధనల బోధనకు ఒక ప్రవక్త పాత్రను పోషించటానికి సిద్ధపడి ముందుకు వచ్చిన కవి మసన చెన్నప్ప గారు. ఆయన మన సు నడిచిన నీడలో ప్రాణం పోసు కున్న పద్య పదాల స్వరాల లోగిళ్ల ల్లోకి ఇష్టంగా ఒక్కసారి ప్రవేశిద్దాం రండి. **'కోకిలమ్మ పెళ్లికోర్కెతో జేసిన / విశ్వనాథ నెపుడు వినుతి సేతు; / అందమైన ప్రకృతి నాదరించనినాడు / కళలు లేవు, వట్టి కలలు దప్పు'...** ఈ పద్యాన్ని పఠించగానే కవిసామ్రాట్ విశ్వనాథగారు ఎంతో రసవత్తరంగా, మధురమైన జానపద వ్యావహారిక శైలిలో అందించిన సుప్రసిద్ధ గేయకావ్యం 'కోకిలమ్మ పెండ్లి' ఒక్కసారిగా మనముందు రెక్కలతో వాలి పోయింది. ఆ కావ్యంలో విశ్వనాథ వారు కోకిలమ్మ వివాహాన్ని ఒక అందమైన ప్రకృతి పండుగలా చిత్రీకరించిన ఆ సాహిత్య వైభవం తన ప్రాభవంలోకి చేయిపట్టి మనల్ని నడిపిస్తోంది. ఈ పద్యం చివరి పాదాలలో లోకానికి హితం చెప్పుతూ 'ప్రకృతిని ఆదరించాలి, ప్రేమించాలి, కాపాడు కోవాలి... అప్పుడే ఈ ప్రపంచం కళాత్మకం గా కళకళలాడుతుంది. ప్రకృతిపట్ల నిరాదరణ ప్రారంభమైన మరుక్షణమే కళలు, కలలుగా మారటానికి రంగస్థలం సిద్ధ మవుతుంది...' అంటూ లోకాన్ని హెచ్చరిస్తు న్నారు కవి మసన చెన్నప్పగారు.




**ప్రతులకు:** మసన చెన్నప్ప
9-76/2, ఉదయ్‌నగర్ కాలనీ
బోడుప్పల్, హైదరాబాద్-92
సెల్: 98856 54381

**'గురువు చేత శిష్య కోటికి మేలగు / గురువు చేత విద్య గొప్పదగును / గురువె తల్లి, దండ్రి కోర్కెలు దీర్పంగ / గురువు లేని విద్య గుడ్డి విద్య...'** అంటూ గురువును స్తుతిస్తూ కొనసాగిన పద్యం గురువు శబ్దానికి పద్యం పాదాలతో అభిషేక చేసినట్లుగా వుంది. తన జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దిన గురువుల జ్ఞాపకాల వరుసల్లో గోపదేవశాస్త్రి గారి ప్రస్తావన కవి చెన్నప్పగారి గురుభక్తికి ఒక గొప్ప సంతకంలా నిలబడిపోతోంది. తన జీవితాన్ని విలువలతో కూడిన సంస్కార స్వరూపంగా మలిచిన గురువులందరూ నిత్యం తన పూజలందుకునే దేవతలుగా నిలిచే వున్నారని, తన గుండె శబ్దాల సాక్ష్యాన్ని తన పద్యాల నిండా బిగ్గరగా వినిపిస్తున్నారు కవిగారు. అదే సమయంలో వేదాలను గురించి ఎప్పటికీ గుర్తుండిపోయే విధంగా **'వేదములకు సాటి వాదముల్ కావమ్మ / వేద విద్య యనగ విశ్వవిద్య / సత్య విద్య యదియె సదసద్వివేకమ్ము / కలుగ జేసి భ్రాంతి దొలగజేయు'** అంటూ ఒక వ్యాఖ్యానం తన విన్యాసాలతో పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తోంది. ప్రాచీన కాలంలో మహర్షులు తమ తపోబలం ద్వారా బ్రహ్మాండంలో దాగివున్న విశ్వసత్యాలను ధ్వని రూపంలో సాక్షాత్కరింపజేసిన సంపదలే వేదాలని విజ్ఞుల ఉవాచ. వేద విద్య విశ్వ విద్య యని, సత్య విద్యకు అదే మూలమని ఈ గ్రంథం ద్వారా ఆచార్య మసన చెన్నప్ప గారు వక్కాణించిన వాక్యాలు వేదాలకు హారతులిస్తూ నిలబడుతున్నాయి.

మసన చెన్నప్పగారు ఆచార్యులు మాత్రమే కాదు, తన కళ్లెదుట కదులుతున్న మానవ నైజాల లోతుల్ని నేర్పుగా కొలవగలిగిన చతురత కలిగిన సామాజిక శాస్త్రవేత్త ఆయన. పరమేశ్వరుడి తత్వాన్ని సదా తన దినచర్యలో శ్వాసకు తోడుగా నడిపించుకుంటున్న తత్వవేత్త తాను. భగవంతుడి దృష్టిలో సర్వులు పిల్లలే. అందరిని సమదృష్టిలో చూడగలిగిన ఆత్మీయత ఆయనిది. అందుకే ఆయన దేవుడయ్యాడు. **'విశ్వమానవులను విభజించి చూపెడి / వారలెట్లు ముక్తి జేర గలరు...'** అంటూ ఈ సందర్భంలో ఆచార్యుల వారు వెలబుచ్చిన ఈ సత్యంనిండా... విడిగా వుండే మనుషుల్ని కలపటం ఒక పుణ్యమని, విశ్వమానవు లను విభజించడమన్నది మహా పాప మని, ఆ పాపులు ఎప్పటికీ ముక్తిపొందజాలరని ఒక గొప్ప వాక్యాన్ని ఒక శాస నంగా ప్రకటిస్తున్నారు. వంద శాస్త్రాలను నేర్చుకున్న మేధావినని పొంగిపోతే సుఖం, శాంతం నీ చెంత చేరవు. **'యోగమార్గ మందు సాగిపోయిన నాడు / సుఖము గలుగు, మోక్ష సుఖము గలుగు'** అంటూ ఈ గ్రంథంలో వినిపించిన మాటలు వేదవాక్కుల చిరునామాల వైపు దీపాలను వెలిగిస్తున్నాయి. ప్రపంచ భాషలన్నింటినీ నేర్చుకున్న మనిషి పొందే ఫలితాన్ని పరిశీలిస్తే అందులో అసలైన భాష ఏదో తేలక జీవితం తికమకపడుతూ వుంటుం ది. పుణ్యముంటేగాని నిజమైన భాష మన సొంతం కాదని ఆచార్యులవారు తీర్మాని స్తున్నారు.

కోకిలను గురించి ప్రస్తావించిన ఈ కావ్య సంపద మొత్తం కోకిలను కొత్త కోణాలలో ఆవిష్కరిస్తోంది. మనిషి గాయపడితే గానం చేయలేడని, కోకిల మాత్రం నిర్విరామంగా ఎన్ని కష్టాలు, నష్టాలు వచ్చినా, పగలురేయి తన పాటలను విశ్వానికి పంచుతూనే వుంటుదన్న సత్యం మరోసారి తళుక్కుమని ఒక పద్యంలో మెరుస్తోంది. ఎంత ధనాన్ని వెచ్చించినా సరే కోకిల గానామృతాన్ని ఈ అవనిలో పొందటం మానవజాతికి సాధ్యకాదన్న వాస్తవాన్ని కవి ఆకాశంలో ఎగిరే ఒక జెండాలా ఎగురువేస్తున్నారు. ఇంత గొప్పగా పాడే పాటల్ని ఏ బడిలో నేర్చుకున్నావని కోకిలను కవి అడుగుతున్నాడు. గురువు అవసరం లేకుండా అద్భుతంగా పాడే తత్వాన్ని జన్మతః పొందిన కోకిల అదృష్టానికి తన పద్యాలతో హారతులి స్తున్నాడు కవి. అదే సందర్భంలో మరో మాటను అందిస్తూ.... మనుషులు పాడే పాటలను విని అవసరమైతే ఆ పాటలను మనం కలంతో రాసుకోవచ్చు. కాని కోకిల పాటలను రాసుకోవటానికి ప్రపంచంలో వున్న ఏ భాష ఆ సాహసం చేయలే కపో తోంది. చిలుక కావాలంటే పలకగలదు, మరి దానికి పాడే అవకాశం లేదు. 'వన్నెలాడి చిలుక వగలు పోవునుగాని / పగలు సెగలు లేని పక్షి వీవె...' అంటూ కోకిలను తన ప్రశంసల సింహాసనం మీద కూర్చోపెట్టి పద్యాల వింజామరలను వీస్తున్నాడు కవి.

**'వేదములను జదివి విజ్ఞాని నేనైతి / ఉపనిషత్తులరసి ఒజ్జనైతి / చదివి దర్శనములు సత్యమ్ము నెరిగితి / మూల మరసి నేను మురిసిపోతి...'** అంటూ తనను తాను పరిచయం చేసుకున్న ఆచార్య మసన చెన్నప్ప గారు అదే సందర్భంలో తన కోకిల కావ్యం రచనను గురించి ప్రస్తావిస్తూ... **'పద్య కవిని నేను, పాటల కవిగాను / ఐననేమి కోకిలమ్మ! నిన్ను / స్ఫూర్తిగా గ్రహించి కీర్తి కారకమైన / కావ్యమును రచించ గల్గినాను...'** అంటూ తన రచనకు సంపూర్ణమైన స్ఫూర్తి కోకిలేనని, ఆ రుణం తీర్చుకోలేనిదని, చాలా కృతజ్ఞతా పూర్వకమైన భావాన్ని వ్యక్తం చేస్తున్నారు. కోకిల ముందు నిలబడి తన కావ్య రచనకు నువ్వే కారణమని కోకిల మీద ప్రశంసలు కురిపించి సాహిత్య చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి పేజీలను సిద్ధం చేశారు కవి ఆచార్య మసన చెన్నప్పగారు. ఇట్టి కావ్యాన్ని ఇష్టంగా పఠించిన పాఠకులను కోకిలముందు హాజరుపరచి 'ఈ కావ్యాన్ని పఠించిన వారంతా తప్పకుండా జీవితంలో విజయమార్గాల వెంట జీవితాలను నడిపించుకుంటారని, ఇది నిజమని కోకిలముందు పాఠకు లను ఆశీర్వదిస్తున్నారు కవి చెన్నప్పగారు.


ఆర్షకవిగా సుప్రసిద్ధులైన ఆచార్య మసన చెన్నప్పగారు అందించిన ఈ కావ్యంలోని ప్రతి పద్యం, సరళమైన భాషను పట్టుచీరలా ధరించి, సహజసుందరంగా మాటలకు అందని అనుభూతిని మనకు ఆస్తులుగా అందిస్తోంది ఈ పద్య కావ్యంనిండా ఆధునిక శైలి పాఠకులను సమ్మోహితులను చేస్తూ కొత్త నడకలతో నడిచింది. కావ్య పఠనంలో మన వెంట సాగుతున్న కాలం మన సాహిత్య అభిరుచికి, వీస్తున్న గాలి ద్వారా అభినందనలను అందిస్తోంది. అందుకే తాకుతున్న గాలి అంత చల్లగా వుంటోంది.

చాలాకాలంగా తనను ఎంతగానో మురిపిస్తున్న కోకిల రాగా లకు తాంబూలంగా అందజేసిన ఈ కావ్యం నిండా వానప్రస్థాన్ని తనకు తెలిసిన మేరకు వర్ణించానని, పరమాత్మ యథార్థ స్వరూపాన్ని తనకు తెలిసిన భాషలో ఆవిష్కరించటానికి ప్రయత్నం చేశానని చాలా వినమ్రం గా తన మనసులోని మాటలను వెల్లడించు కున్న కవి సంస్కారం గొప్పగా గుభాళిస్తోంది. వేద సిద్ధాంతమైన త్రిత్వాన్ని సమర్థిస్తూ, మాయా వాదాన్ని ఖండిస్తూ, ఆధ్యాత్మికంగా సాగిన ఈ కావ్యాన్ని ఉత్తమ సాహిత్య స్థాయిలో అందించిన ఆచార్య మసన చెన్నప్ప గారికి సమస్త సాహితీలోకం తరుపున హృదయపూర్వక నమస్కారాలను అందజేస్తున్నాను.



-సాహిత్య ప్రపూర్ణ
డాక్టర్ కె.జి. వేణు
98480 70084

## ఒంటరి



పైన
వెన్నెల ప్రవాహం
లోన
బాధ్యతాసుడుల దాహం.

పైన
నవ్వులగొడుగు
లోన
ఒత్తిళ్ళమడుగు.

పైన
బంధాలగాలిపటం
లోన
తగిలిన దెబ్బల సలపటం.

పైన
ఉత్తమప్రశంసల జల్లు
లోన
నెత్తుటిగాయాల ముల్లు.

పైన
అందరు పొగిడే విజయగాథలు
లోన
అప్రకటిత బాధలు.

పైన
చైతన్య ప్రదర్శనలు
లోన
చెడిన ఆరోగ్యంతో ఘర్షణలు.

పైన
నాన్న
లోన
అమ్మ..

నాన్న
అందరికీ అన్నీ చేదుకొమ్మని ఇచ్చి నిల్చిన
ఒంటరి ఎండుబావి,
నాన్న
అందరివాడైనా
తనకు తానేమీ కాని వలసజీవి,
నాన్న
తనకు తానే దొరకనంత దూరంలో..
తన వెనక ఏమీ లేని శూన్యంలో..



-డాక్టర్ కాసర్ల
9441506252

## (అ)శాంతినేత

ట్రంపు మోనార్కు
విశ్వంలో వాడి మార్కు
ప్రగతి డార్కు...

యు యస్ ఏ నేత
ఆక్టోపస్ జలచరం
దేశనేతల చెర...

వాడికి బలం
ఆయుధ కర్మగారం

ఉడకని పప్పులు
తగాదాలే ధ్యేయం...

పేరుకు అగ్రరాజ్యం
కోరదు శాంతి ప్రయాణం
ఎక్కడో ఓ మూల
దాని రక్తపు మరక...

అణు ఇంధనం
తనకే సొంతం
ఉంటే యుద్ధ తంత్రం
డాలర్ విలువ
పడిపోతుందని భయం...

ప్రపంచ దేశాలు
ఏకతాటిపై వస్తే
డాలర్ పతనమై
ఆయుధాలు త్రుప్పు పడితే
కుక్కిన పేనులా
పడి ఉంటాడు
బుద్ధుడే దిక్కంటాడు.



-రేడియమ్
9291527757




ఆధిపత్యం గొంతు లేచినప్పుడే
దాడులు ప్రతి దాడులు మొదలౌతాయి.
ఆలోచనలు ఆక్రోశించి
విచక్షణ కుచించినప్పుడే
యుద్ధం
ప్రపంచ ముఖ చిత్రాన్ని మార్చేస్తుంది.
బలవంతుడు కండలు చూపిస్తే
బలహీనుడు బుద్ధిని వాడతాడు.
అగ్రరాజ్య దాహానికి
నెత్తురోడిన బతుకుల్లో
నిబంధనలు వర్తించవు.
ఉల్లంఘునలు
ప్రపంచ న్యాయ స్థానానికి కనిపించవు.
ఒక దాడి యుద్ధమై
ఒక యుద్ధం. ప్రపంచ యుద్ధమై
సంక్షోభాల బాటలో
గ్యాస్ గానో పెట్రోల్ గానో
సామాన్యుడి బతుకుని
చిద్రం చేస్తుంది.
యుద్ధం లోపలైనా బయటైనా
మానవాళిని దహిస్తుంది.
విద్వంస రచన ఆపి
శాంతివనం లో నివసించినప్పుడే
జీవితాల్లో వెలుగు రేఖలు చూడగలం.
ఆకు పచ్చని కాంతుల మధ్య
బతకగలం.... !
( అమెరికా - ఇరాన్
యుద్ధ నేపథ్యంలో...)



-గవిడి శ్రీనివాస్
7019278368

పుస్తక సమీక్షలు

# 'సౌందర్యరాగం' డా॥సముద్రాల శ్రీదేవి అద్భుత గజల్స్

డా॥ సముద్రాల శ్రీదేవి, ప్రేమ పార్శ్వాలను హృదయ రాగంతో స్పృశించి, గజళ్ళను సృజించి, తన్మయింప చేయగల అద్భుత కవయిత్రి. తానే ఒక ప్రేయసిగా, ప్రియునితో, 'సౌందర్యరాగం' సంపుటి గజల్స్‌లో, ఆమె అనుభూతి వ్యక్తీకరణ, అనన్య సామాన్యం. సున్నిత భావోద్విగ్నత, సురుచి కవిత్వ తత్త్వం, సుమధుర సౌందర్య స్పర్శతో అక్షరాలను అద్భుత శిల్పాలుగా మలచగల ఇటు వంటి కవయిత్రి తెలుగునాట బహు అరుదు. 'సౌందర్యరాగం'లో ప్రతీ పుటకు తొమ్మిది లెక్కన గజల్ 'కప్లెట్స్', 500 పైగా కొలువుతీరి పరవశింప చేస్తున్నాయి. ఆఖరి కప్లెట్‌లో ప్రతీ పుటలో కవయిత్రి శ్రీదేవి హృదయ సాక్షాత్కారం సమ్మోహింపచేస్తుంది. ఈ 'సౌందర్యరాగం' గజల్స్, పూరేకుల పొదలో దాక్కున్న అక్షరమా ధుర్యాన్ని ఆఘ్రాణింప చేస్తున్నాయి. ప్రేమ, విరహం, వియోగం, శ్రీదేవి గజళ్ళలో తీవ్ర ఆకాంక్ష జీవన గానం వినపడుతుంది. గజల్ షేర్‌లలో ప్రతీకాత్మక అభివ్యక్తితో కవయిత్రి ఆకట్టుకొంటారు.


**"సూర్యుడిగా నేనుండగ భూమిగాను నీవుండగ**

**నా చుట్టూర నిన్ను నేను తిప్పాలని కోరితిన్"** అంటారు.

వాకిలిలో ముగ్గు, పొలంగట్టు చెట్టు, వీధిలోని విగ్రహం సంకేతాలుగా సౌందర్య రాగం అనుభవింప చేసారు.

**"మల్లెపూల మంచములో నల్లగున్న రాత్రిలోన**

**చలిలోన వేడి కొరకు కాచుటలో ప్రేమ ఉంది"**




ప్రతులకు:
సముద్రాల శ్రీదేవి,
వై/ఆఫ్. సుధీర్ కుమార్
ఫ్లాట్ నెం.102. ఇ.నెం. 4-84/1, విజయ నివాస్ అపార్టుమెంట్, దుర్గానగర్, దిల్‌సుఖ్‌నగర్,రంగారెడ్డి జిల్లా. హైదరాబాద్- 500 060
సెల్: 99498 37743

ఎన్నో చక్కని మత్లాలు ఈ గజల్ సంపుటిలో చోటు చేసుకున్నాయి.

**"చిరునవ్వులు విరబూసిన మధుమాసం మన కోసం..**

**చిరుమల్లెలు వెదజల్లిన దరహాసం మన కోసం"** లాంటి శాబ్దిక సౌందర్యం ఉట్టిపడే పేర్లు కవయిత్రి సృష్టించారు.

**"నా కవిత్వం నిశిరాత్రుల నిరీక్షణలో, నిశ్శబ్దాల సంప్రోక్షణలో జీవించింది"** అంటారు. శ్రీదేవి, సత్య సౌందర్య కవితా హృదయాన్వేషణను ప్రతిబింబింప చేసే ఈ గజల్స్ సంపుటి 'స్వప్నాలే సత్యాలై ప్రేమ యాత్రగా గజల్స్ సౌందర్యరాగం ప్రతిధ్వనింప చేస్తున్నాయి. కవయిత్రికి గజల్ నిర్మాణ నైపుణ్యం, కవిత్వ భావుకత, మెరుపు విరుపుల నైపుణ్యం, వుండటంతో సౌందర్యం మాధుర్యం ఉట్టిపడే గజళ్ళు నిర్మించడం, 'కళారత్న' బిక్కి కృష్ణ ప్రశంసించినట్టుగా అగ్రశ్రేణి గజల్ కవయిత్రి స్థానం అలంకరింపచేస్తోంది.



-జయసూర్య
9440664610

# తడిపి ముద్ద (ముద్దు) చేసిన జ్ఞాపకాలు


పునశ్చరణ చేసుకుంటున్న జ్ఞాపకాలు నవరస భరితాలు. నిన్న క్షుణ్ణంగా తెలుసు. నేడు పై ఇంకా పూర్తి అవగాహన ఉండదు. తెరవని పుటల్లాంటి రేపు ఆ విధాతకు తప్ప మరెవరికీ తెలియదు. అందుకే జ్ఞాపకాలు ఎప్పుడూ అందంగా ఉంటాయి. ఆనందాన్ని కలుగచేస్తాయి. కొండొక చో కొన్ని జ్ఞాపకాలు ముల్లుగా గ్రుచ్చుకోవచ్చు. చేదులా మనసు 'ఏదో' అవొచ్చు. అందరి సంతకాలు ఒకేలా ఉండవు. అలాగే అందరి జ్ఞాపకాలు, వాటి నెమరు వేతలు ఒకేటా ఉండవు. అందుకే జ్ఞాపకాల జల్లులు ఎవరివైనా, పాఠకులకు ఆనందం కలుగచేస్తాయి. అందునా, అందంగా చెప్పగలిగిన కళను స్వంతం చేసుకున్న వారి జ్ఞాపకాలు అందంగా ఉంటాయి. చదువరికి ఆనందం కలుగ చేస్తాయి. నిజాయి తీగా చెప్పిన జ్ఞాపకాలు మనసుల్ని సున్నితంగా స్పృశిస్తాయి. పాఠకుడు వాటిలో తనను చూసుకుంటాడు. పాఠకుడికి రచయితకి మధ్య కంటికి కనబడని ఓ అజ్ఞాతనం ఇద్దరినీ ఒకటి చేస్తుంది. రచయిత/రచయిత్రితో బాటు తానూ నవ్వుతాడు. దుఃఖానికి విచలతుడవుతాడు. వెలుగు చీకట్ల ఆ ప్రయాణంలో పాఠకుడూ సహ-ప్రయాణికుడవుతాడు.

రచయిత్రి తన ముందు మాట (తొలి పలుకు-శీర్షిక)లో ఈ పుస్తకాన్ని 'బాల్య స్మృతులు' అన్నారు. కాని వీరు తన చినపాప ఎడ్యుకేషన్ వరకు (80వ అధ్యాయం) 'కవరు' చేసారు. అయితే రచయిత్రి బాల్యం గురించిన జ్ఞాపకాలే ఎక్కువగా ఉన్నాయి. చిత్తలూరు గ్రామం (నల్గొండ)తో మొదలైన జ్ఞాపకాలు, బాల్యం, కౌమారం యవ్వనం, వివాహం, సంతానం వరకు తన పాత జ్ఞాపకాలను తోడుకున్నారు. ఈ జ్ఞాపకాలు చదువుతోంటే రచయిత్రి శ్రీదేవితో పాటు పాఠకులూ, పులకించిపోతారు. అందరిలా, వీరూ ఆనాటి కుటుంబ వ్యవస్థ (సమిష్టి కుటుంబం)లో పెరిగారు. తన బలాలు, బలహీనతలు, మొహమాటం లేకుండా మనతో పంచుకున్నారు. అమ్మమ్మ ఇంట్లో అందరికంటే చిన్నదైన శ్రీదేవి పొందే అభిమానం, అమ్మమ్మ మామయ్యలు తాతయ్యల నుండి వీరు ప్రత్యేకంగా పొందిన శ్రద్ధ, ప్రేమలను ప్రస్థావించారు. అందరిలా, వీరూ, ఏటిగట్టున పిట్ట గూళ్ళు కట్టారు. గట్టున ఉన్న చిన్నగుడి, ఏట్లో స్నానాలు, అమ్మమ్మ గారింట్లో (చిత్తలూరు) గదులు, ఇంటివెనక, ఇంటి ముందు ఉండే జాగాలో వీళ్ళ ఆటలు, వాళ్ళ తాత దైవభక్తి, ఇంటి ముందున్న తాతగారు నిర్వహించే చిల్లర కొట్టు, ఊయల ఊగటం, బొమ్మరిళ్ళు, నాటకాలు, బొమ్మల పెళ్ళిళ్ళు, చొప్పకట్టె బెండుతో చేసిన బొమ్మలు, అమ్మమ్మ బద్రమ్మ చూపిన ప్రేమ, శూలాధారి అనే విచిత్ర వ్యక్తి, సత్తమ్మ పిన్ని, పండుగలు ఎలా సెలబ్రేట్ చేసుకునే వారో చెప్పారు.

మొదటి రోజు బతుకమ్మను **'ఎంగిలి పూల బతకమ్మ'** అని ఎందుకు అంటారో చెప్పారు. అక్కడి దేశీయ పదాలైన **'మడగ'** (మండువా?) **పైవాసి** (పైవాసం?) ఒత్తి (పొయ్యిని ఆనుకుని ఉండి మరో చిన్న పొయ్యి) **డిప్పు** (చిల్లర కొట్టు)- అంటే ఏమిటో తెలుసుకుంటాము.

అందరూ బాల్యాన్ని అనుభవించిన వారే! మరి ఈ రచయిత్రి జ్ఞాపకాల్లో ఏమంత ప్రత్యేకత అని మీరు అడగొచ్చు. వీరి క్లుప్తత వచన కవిత్వం లాంటి పదాల పొందిక, నిజాయితీగా చెప్పుకున్న, మనసు విప్పుకున్న తీరుకు పాఠకుడు ముచ్చట పడిపోతాడు. ఏకబిగిన 136 పేజీలు తిరగేస్తాడు. బాగా రాసింది అన్న కంక్లూజన్‌తో ముగిస్తాడు.

ఒకటి రెండు విషయాలపై రచయిత్రి శ్రద్ధ వహించి ఉండాల్సింది. పుస్తకం ఎక్కడ దొరుకుతుందో తెలియదు. పోనీ రచయిత్రిని సంప్రదిద్దామన్నా వీరు పేరు తప్ప మరే వివరాలు ఇవ్వలేదు.





ప్రతులకు:
రాపోలు శ్రీదేవి
సెల్:



-కూర చిదంబరం
సెల్: 8639338675

# జీవితానికి ఉపయోగపడే సుధీమణి శతకము

సహజకవి, అష్టావధాని బండి కాడి. అంజయ్యగౌడ్ తాజాగా అందించిన శతకం 'సుధీమణి శతకము'. గతంలో దాదాపు 15 శతకాలు తదితర గ్రంధాలు వున్నాయి. ధ్రువ కోకిల వృత్తాన్నే ఎంచుకుని ఈ శతకం రాసానని చెప్పుకొచ్చారు. ఈ శతకంలో మానవ జీవన విధానానికి నిలువు టద్దంగా పద్యాలు నిలిచాయి. ఎంత భాగ్యమున్ననూ, కుశలమా అని పల్కరించెడి కూర్మి మిత్రుడు లేకున్నచో పశువుకన్నను హీనమే అంటారు. కలం కన్నా బలం కలిగిన ఖడ్గం ఏదియూ లేదంటారు. సమాజమందలి కల్మషాత్ముల వైఖరిని నిలువరించగవచ్చు నంటారు. మనిషికి కలుపుగోలుతనం కావాలంటారు. దానికి మించిన కాంచనం ఇలలో లేదంటూ, అలాంటి గుణం వలన బల్లము మెండుగా వుంటుందనీ, అలా లేని వారు పలు రకాల బాధలు పొందుతారనీ ఒక మంచి సలహానిచ్చారు. ధనం శాశ్వతం కాదనీ, అది శాశ్వతంగా వుండబోదనీ, కావున మనుష్యులందు మంచి పెంచే మార్గంగా నిలవానీ, వినయంతో, వివేకంతో, బ్రతికితే మాన్యుడౌతాడంటూ చెప్పడంలో ఎంతో గొప్ప సందేశం వుంది. దయయె సత్యము, ధర్మ మార్గము, దయయె ద్రవ్యము, దయయె సర్వము మానవాళికి ధన్యతను ఒనగూర్చుతుంది, తప్పకుండా అని చెబుతూ మానవులు దయను వీడరాదన్నారు. కీడు అని ఎంచకుండా కుల, మతమ్ముల పేరిట గోల చేస్తున్నారనీ, నేరములు కొందరు రౌడీమూకల చేత చేయిస్తున్నారనీ, అలాంటి వారి క్రూర చేష్టలకు అంత మెప్పుడు? అంటూ ప్రశ్నగా వదలి వేశారు. లోకంలో అహం కారులై పెద్దలను గౌరవించని వారిపై ధ్వజమెత్తారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలనూ అక్రమాలనూ ఎత్తి చూపించారు. మనిషి మనిషిగా జీవించాలనేదే వీరి కోరిక. ఒక మంచి శతకమిది.




ప్రతులకు: బి.అంజయ్యగౌడ్
రేణుకా నిలయం.
ఇ.నెం.2-11/231పి,
సాయి బాలాజీ ఎన్‌క్లేవ్
మల్లంపేట, ముండిగల్ (మం)
మేడ్చల్ జిల్లా-500 090
సెల్: 90966163962



- డా॥ పులివర్తి కృష్ణమూర్తి
సెల్:9949092761

## నాన్న...!

సీసము
సంసార సాగర సంఘర్షణల మోయ
నగచాట్లనెన్నింటి ననుభవించు
ఆలు బిడ్డల కొరకవమానములనెన్నొ
తనలోనె దాచుకో తపనపడును
మధ్యతరగతి లో మ్రగ్గిపోనెంచెడు
మానవుండే వాడు మానసమున
పేదవాడి విలువ ప్రేమలోదాగును
పెందలకడలేచి పెనుగులాట.

ఆ.వె.
కష్ట సుఖములందు కష్టాలె కడదాక
సుఖపు జీవనమున సోకుపడడు
బిడ్డ కళ్ళలోని దొడ్డసంతోషమే
నవ్వు ననెడు వాడె నాన్న వాడు! .

సీసము
సంపదెంతున్నను సరిపోవునో లేదొ
తన బిడ్డ బిడ్డల దాక యనుచు
కష్టముల్ పడియైన నిష్టమౌ నిడుములు
తనయులు కలిమిలో దనర నెంచు
కార్పొరేటు దశలొ కలిమి యున్నను గాని
అధికమౌ సంపదకాశ పడును
తిండి నిద్రలు లేక తిప్పలు బడనెంచు
చివరి శ్వాస దనుక చింతలేను

ఆ.వె.
కలిమి యున్ననేమి కష్టాలె సుఖమని
తనదు సుతుల కొరకె త్యాగమనును
వయసు ముదురు వేళ వనరుల ఖర్చుకై
తపనపడెడు వాడె తగిన నాన్న!.

సీసము
రాజకీయము నందు రాణించు నాయకుల్
వారసత్వమిడక వరలుకొరకు
తగిన రీతుల నెన్ని తకరారు లెన్నైన
ఓరిమి వహియించి నొప్పుబాధ
పదవికై పడరాని పాట్లెన్నొ పడనెంచి
మృదువైన యెత్తులు మిక్కుటముగ
సంపదల్ ప్రోగేయు సంతు సంతునకైన
సరిపోవు విధమున సాగునటుల.

ఆ.వె.
తనయ,తనయులకును తన
వారసత్వము
రావలె నను కోర్కె రమ్యమనును
తగిన యత్నములను తప్పక జేసెడు
వారధిగను నిల్చు వాడె నాన్న!



-యెనిశెట్టి గంగా ప్రసాద్
సెల్ 9866447234

## కనురెప్ప రక్షణనే నాన్న

పిల్లలకు అనుక్షణంరక్షణ అవసరము
ఆరక్షణనే నాన్న
పలుకుతుంటే ఎంత హాయి నాన్న
అమృతం కన్నాతియ్యని,మంచుకన్న చల్లని పిలుపు నాన్న
ప్రేమకు రూపం తప్ప,భావం లేని బంధం నాన్న
మనమెక్కిన తొలి విమానం నాన్న భుజాలు
జీవిత పాఠాలు చెప్పే మొదటి గురువు నాన్న
క్రమశిక్షణకు మరో రూపం నాన్న
ఓటమిలో వెన్నంటి ఉండేవాడు నాన్న
గెలిపుతో మురిసి పోయే వాడు నాన్న
కష్టంలో బ్రతుకు పై భరోసా కల్పించే శక్తి నాన్న
నిత్యం శ్రమించే నిస్వార్థ శ్రామికుడు నాన్న
కాలం భాట మీద కనిపించని సాధకుడు నాన్న
పతంగం లాంటి మన ఆశలకి ఆధారం నాన్న
లోపాలను సరి చేస్తూ భవిష్యత్తు కు పునాదులు వేసే వాడు నాన్న
బంధం బలం నాన్న
ధైర్యం క్రమశిక్షణ నాన్న
నాన్న గురించి ఎంత చెప్పిన తక్కువే
ఒక్కమాటలో చెప్పలేం....
పితృదినోత్సవ శుభాకాంక్షలు.



-టి.సంయుక్త
8500175459

## నాన్నా నాన్నా అంటూ

నాన్నానాన్నా అంటూనేనూ.....
ఏం నాన్నా అంటూ
మా నాన్నా....
నా వెంటే ఉంటూ నన్నుకంటూ నాతోవుంటూ
అబ్బా! నిజంగా
నాన్నకు నేనంటే ఎంతప్రేమ!.
అమ్మకు నేనంటే ప్రేమే
కానీ
నేను నాన్నతో ఉంటూ ఉంటే
అమ్మకి ఉంటుంది నామీద ఇంకాఇంకా ప్రేమ.
నాతోనే ఉంటూ నా పక్కనే ఉంటూ
నన్నంటి నడిపిస్తున్న నాన్నంటే
నాకిప్పటికీ ఎప్పటికీ ప్రేమంటే ప్రేమే
ఐనా.....
మా నాన్నని నే వెన్నంటి
ఉంటేనే కదా మానాన్న ఉండేది
పదికాలాలు నావెంటవెంటే



-గరిమెళ్ళ కాశీఅన్నపూర్ణ
96185 86277

## నగరం వీపు మూటల మయం

వీపు మూట నగర వాసికి చిహ్నం.
ద్విచక్ర వాహనదారుకు హెల్మెట్
ఉండదేమో గాని వీపు మూట
తప్పనిసరి. వీపు మూటకు జాతీ
లింగ భేదం కానరాదు. బాల్యంలో
తండ్రి, వీపున మోసాడో లేదో కానీ
ఇక్కడ ప్రతి ఒక్కరికి వీపు
మూట మోయడం అత్యవసరం.
జీవితమెంత భారమైనా.. వీపు
మూటను మోయడం వీసమెత్తు.
వీధి బడైనా, డబ్బున్నోళ్ల బడికైనా
విద్యార్థికి వీపు మూట అనివార్యం.
గర్భధారణ తొమ్మిది మాసాలే!
బాల్యం నుంచి ఉద్యోగ విరమణ
వరకు వీపు మూట ధారణ దిగిపోనిది.
వీపు మూట నగరవాసికి
కదిలే లాకర్.కీ లేకుండా
బండి ఎలా నడవదో.. వీపు మూట
లేకుండా ఉద్యోగికి ఏ పనీ జరగదు.
వీపు మూట నగర కర్ణుడి సహజ కుండలం.

పౌరసత్వం గల నగరవాసికీ
వీపు మూట ఒక ఐడి కార్డ్
ఎంట్రీ కార్డ్ వారసత్వ వీపు ముద్ర.
పాకెట్లో మొబైల్, ఆరో ప్రాణం.
వీపున బ్యాక్ పాక్ మరో ప్రాణ
వాయు పాక్-అస్తిత్వం వీపు మూట రూపంలో.
జీవితపు బరువులు మోసి
వెన్ను వంగి ఉండవచ్చునేమో.. కానీ
వీపుమూట మోయడానికి వెన్నుముక
వెరపు చూపదు.
ఒకనాడు ముంజేతి
కంకణము.. ఇప్పుడు వీపు మూట.
వీపు మూట కొందరికి ఉప్పుమూట
మరికొందరికి దూది మూట.
పిల్లడో, పిల్లదో కాదు- ముద్దుల
మూట..
వీపు మూటే నిర్ద్వంద్వంగా.
మాయల పకీర్ పంచప్రాణాలు
చెట్టు తొర్రలో. నగరవాసి ఆయువు
పట్టు..
వీపు మూటలో.
వీపు మూట, నగర విక్రమార్కుడు
నిశ్శబ్దంగా మోసే భేతాళుడు.



-మల్లేశ్వరరావు ఆకుల
79818 72655

## ఉత్తరాలు..ఉనికి కోల్పోయే..?




ఉభయ కుశలోపరి అంటూ
ఉల్లముతో రాసే ఉత్తరాలేవి..?
యోజనాల దూరాల నుంచి
యోగ క్షేమాలను మోసుకొచ్చే
కలహంసల లేఖలు జాడేది..?

ఆధునిక సాంకేతిక కాలాన
అరచేతులలో చరవాణులు
స్థిరనివాసాలు చేయటంతో
ఉత్తరాలు ఉనికిని కోల్పోయే..!

అమ్మలు రాసిన కమ్మలు చదివితే
ఎంతెంత కమ్మగా అనిపిస్తాయో
నాన్నలు లిఖించిన ఉత్తరాలలో
ఎన్నెన్ని తాత్పర్యాలు ఉన్నాయో..!

ప్రియురాలు రాసిన ఉత్తరాలలో
గుండెలోన వలపు అత్తరులే నిండే
ప్రియురాలికి రాసిన ప్రియుడి లేఖలో
హృదయమే అర్పించిన సంకేతాలు..!

ఊరినుంచి వచ్చిన ఉత్తరాలలో
బోలెడు సంగతులు గుబాళించు
ప్రియ మిత్రులు రాసిన ఉత్తరాలలో
నిజమైన స్నేహ బంధమే ఊరించు..!

ఉత్తరాలు రాస్తే భాషలో
ప్రావీణ్యత
లేఖలు రాసిన వారంతా
రచయితలే
మన దేశాన్ని పాలించిన
మహానేతలే
చరవాణిలో సందేశాలను
పంపటం తప్ప
నేటి తరానికి లేఖలు రాసే
చేరాత ఏది..?
అడపాదడపా ఉత్తరాలను
రాసేద్దాం
తోకలేని పిట్టలను తపాలా
డబ్బాలో వేద్దాం..!



-జి.సూర్యనారాయణ
6281725659

# ఇరాన్ ఇరాన్ మా తాతగారి మోనోలాగ్

అవును. ఇది మా తాతగారి స్వగతం!

రచన అంటే విభిన్న వ్యక్తుల స్వగతాలు అదే మోనో లాగ్‌లు అంటారాయన. ఇదే మాటను కొంతమంది సాహితీ ప్రముఖులు చెప్పారంట. అసలు తీవ్రమైన ఎండల కంటే, మా తాతను కలవరపెడుతున్నది ఇరాన్- అమెరికా-ఇజ్రాయిల్. ఇంకోమాటలో మినీ ప్రపంచ యుద్ధాలే. నలభై ఎనిమిది డిగ్రీల వేడిని, వడ గాలులను భరించవచ్చు గానీ, సునామీలు, భూకంపాలు మనల్ని వణికించవచ్చు గానీ అవి మన చేతుల్లో వుండవు అంటాడాయన. ఇది మనుషులు చేసుకున్న విలయం.

ఇక కథలోకి వద్దాం.

నాకు ఇరాన్ అంటే ప్రాణం. పిచ్చి. అంతకుముందు నాకు ఇరాన్ ఛాయ్ గురించి మాత్రమే తెలుసు. అందులో సాల్ట్ బిస్కెట్‌ని ముంచి తింటుంటే ఆ అనుభూతి వేరు. అందులో ఏవేవో కలుపుతుంటారు. అందుకే ఆ రుచి. ఓ రకంగా ఇది కూడా మద్యం లాంటిదే. ఓసారి అలవాటు పడితే నాలుక పీకేస్తుంది అంటారు. అసలు ఇరాన్ ఛాయ్‌ని మరగబెడుతున్నప్పుడు చూడటం, అప్పుడు నాలుగు దిక్కులా పరుచుకుంటున్న వాసన కూడా మత్తే అనిపిస్తుంది.

మూడు దశాబ్దాల క్రితం మొదటిసారి ఇరాన్ సినిమాను చూశాను. ఆ భాష మనకు అర్థం కాదు. ఆంగ్లంలో సబ్ టైటిల్స్ వుంటాయి. అవి లేకపోయినా ఫర్వాలేదు. ప్రేక్షకులు ఫాలో అవుతారు. ఆ సినిమా నన్ను ఊపేసింది. అక్కడ నుండి నేను ఇరాన్ సినిమాలను వెతుక్కుని మరీ చూడటం మొదలుపెట్టాను.

అప్పుడు నాకు అనిపించింది. ఈ దేశం నుండి ఇరాన్ వెళ్ళిపోవాలి. నాకు పిల్లలున్నారు. మనవళ్ళు, మనవరాళ్ళు వున్నారు. ఇక్కడ నా కుటుంబంతో పాటు నా సాహితీ మిత్రులున్నారు. వీరందరినీ వదిలి అక్కడకు వెళ్ళిపోవాలి. ఆ మహా దర్శకుల దగ్గర పని చేయాలి.

కనీసం కొన్ని అద్భు త సినిమాలకు పని చేయాలని అనిపించింది.

ఇంతకూ ఇరాన్ సినిమాల్లో ఏముంది? జీవితం వుంది. అంతులేని పేదరికం వుంది. ఎప్పటికప్పుడు అభద్రత వుంది. అయినా ఇవన్నీ వున్నచోటులో అద్భుతాలు జరగాలి. అలా జరుగుతుందా అంటే అది వేరే విషయం. ఈ సినిమాల్లో అడుగడుగునా తాత్వికత వుంటుంది. అది పాత్రల మధ్య, లోకల్ కలరింగ్‌లో, సన్నివేశాల్లో వుంటుంది. ఈ సినిమాలు చూసి తన్మయత్వం చెందుతాం.




ఆశ్చర్యపడతాం. మనసారా కన్నీళ్ళు పెట్టుకుం టాం. ఏకకాలంలో అన్ని రసాలను అనుభూతి చెందుతాం. జీవితం అంటే ఏమిటి అనే తాత్విక ఆలోచనల్లోకి జారిపోతాం.

అన్నట్లు ముస్లిమ్స్ అంటే ఛాందసవాదం అనుకుంటారు. వారు మనుషులను ఏమాత్రం కనికరం లేకుండా చంపేస్తారు అంటారు. అలాగే రాజ్యకాంక్ష వుంది అంటారు. ఇంకా అనేక రకాల విమర్శలు వున్నాయి. గత చరిత్ర అంతా రక్తంతో తడిసిపోయింది. అదో కోణం. వీటి లోతుల్లోకి నేను వెళ్ళటం లేదు.

నాకు ఖలీల్ జిబ్రాన్ అంటే ఇష్టం. గాలిబ్ అంటే ఇష్టం. ఉమర్ ఖయ్యూమ్ అంటే ఇష్టం. వారు ప్రేమ గురించి, బతుకు గురించి, మధువు గురించి, ముఖ్యంగా మగువ గురించి ఎంత గొప్ప సారస్వతం అందించారు. అలా ఎడారుల మధ్య వున్నా వారి కవిత్వం, గజల్స్ వింటూ ఇసుక తుఫాన్లను కూడా ఆనందంగా ఎదుర్కోవచ్చు అనిపిస్తుంది. మనల్ని ఇసుక గుట్టలు కప్పేసినా అవి వింటే ఒక్కసారిగా ఆ గుట్టలను ఛిద్రం చేస్తూ మృత్యుం జయుల్లా ఈ ప్రపంచంలోకి పునరాగమనం చేయవచ్చు అనిపిస్తుంది.

ఈ మధ్యనే పిల్లలకు చెప్పాను. మంచి సినిమాలను మీరు పరిచయం చేయండి. పుస్తకాలు మాత్రమే కాదు. మంచి సంగీతం, సినిమాలు కూడా బతుకు మీద తీపిని పెంచుతాయని.

నాకు ఇరాన్ సినిమాలు చూస్తుంటే హాలీవుడ్ సినిమాల్లా అభూత కల్పనలు, ఫాంటసీలు, మిస్సైళ్లు, వందలూ, వేలుగా జనాన్ని కాల్చి చంపటాలు కనిపించవు. మన దేశంలో వున్నట్లు వుంటుంది. భాష వేరైనా మన జీవితాలు కూడా ఇంతే కదా అనిపిస్తుంది.

ఇంతమంది తత్వవేత్తలు అక్కడ తయారవటం వెనుక కారణాలను అన్వేషించాలి అనిపిస్తుంది. అక్కడ, ఆ ఆయిల్ కంట్రీస్‌లో ఎంత సంపద వున్నా, ఎన్ని వైభవాలున్నా అక్కడ పేదరికం వుంది. కష్టాలు, కన్నీళ్ళు వున్నాయి.

ఏ దేశానికయినా ఇవి రక్తపు మచ్చలు. అలాంటిది ఇప్పుడు ఇరాన్ ఓ యుద్ధ వేదిక అయింది. ఇందులో తప్పు ఎవరిది? అమెరికా వాడిదా? ఇజ్రాయిల్‌దా, దీని వెనుక ఎన్ని అగ్ర రాజ్యాలు వున్నాయి. వాటి గమ్యం ఏమిటి? ఆయుధాలు అమ్ముకోవటమా. ఇవన్నీ మేధావులు చర్చిస్తారు. చర్చిస్తున్నారు.


అసలు ఈ యుద్ధం గురించి ఇరాన్ ప్రజలు ఏమనుకుంటున్నారు. అక్కడి పిల్లలు ఎలా వున్నారు.

యువత ఎలా వుంది. అక్కడి రచయితలకు, దర్శకులకు స్వేచ్ఛ వుంటే గొప్ప సినిమాలు, సారస్వతం వస్తుంది ఇప్పుడు. అక్కడ వున్న తత్వవేత్తల గురించి మనకు తెలియదు. ఇప్పటికే నేల మాళిగల్లో భవిష్యత్ తరాల కోసం గొప్ప కవిత్వాన్ని, పాటల్ని, నిక్షేపం చేసుంటారు. కవులూ, కళాకారులు శాశ్వతంగా మౌనంగా వుండలేరు కదా!

హోర్ముజ్ జలసంధి-ఆయిల్-గ్యాస్. చివరకు ఇంటర్నెట్‌ని అందించే సముద్రంలోని కేబుల్స్‌ని కూడా ధ్వంసం చేస్తారంటున్నారు. ప్రపంచం కనీ వినీ ఎరుగని, చివరకు కరోనా లాంటి మహమ్మారులు చేయలేని విధ్వంసాన్ని ఈ యుద్ధం చేయబో తోందని గంటకో వార్త.

ఇప్పుడు అయ్యో ఇరాన్? ఆహా ఇంత విద్వంసమా? శ్మశానాలను, రాబందులు ఎగిరే రాజ్యాలను మీరు ఏలతారా అని ఆ దేశాన్నే కాదు యుద్ధాలను ప్రేమించే ప్రతి దేశాన్ని, ప్రతి నాయకుడ్ని, మనుషులంతా ఏకమై ప్రశ్నించాలనిపిస్తోంది.

ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం. నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం అన్న శ్రీశ్రీ లు గుర్తువస్తున్నారు. ఇంకా ఇది సాగకూడదు. పోరాటం ఇంటి నుండి మొదలవ్వాలి. అది ఇరాన్ అయినా, అమెరికా అయినా, పాక్ అయినా, రష్యా-చైనాలయినా, లేకుంటే మానవ జన్మకిది అంతిమ ప్రస్థానం!



- పి.చంద్రశేఖర అజాద్
92465 73575

# వాస్తు శిల్పి, కవితా శిల్పి డా॥ బి.యన్.రెడ్డి

ప్రగతి శక్తులకు పెట్టనికోట అయిన నల్లగొండ జిల్లాలో అటు రాజకీయ రంగంలోనూ, ఇటు సాహిత్యరంగంలోనూ తనదంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నవారు కొందరైతే ఆ కొందరిలో వాస్తు శిల్పిగా కవితా శిల్పిగా రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన ఏకైక వ్యక్తి డా॥ బి.యన్. రెడ్డి.

నల్లగొండ జిల్లాకే కీర్తి ప్రతిష్టలు తెచ్చి జిల్లా పేరును విదేశాలలో చాటి చెప్పి అందరిచే బి.ఎన్.గా పిలువబడిన బద్దం నర్సింహ్మారెడ్డి నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో రామచంద్రారెడ్డి, శాంతమ్మ దంపతులకు 1933 జూన్ 21న జన్మించారు. ఉన్నత చదువులు చదువుకొని అమెరికాలో భవన నిర్మాణ రూపకల్పనలో విశేషానుభవం గడించి స్వదేశానికి వచ్చి విర్గో ఆర్కిటెక్ట్ అండ్ ఇంజనీర్స్ సంస్థను స్థాపించి ఎన్నో విద్యాసంస్థలు సినిమా హాళ్లు, హోటళ్లు, పరిశ్రమల భవనాలకు డిజైన్ చేశారు. తిరుపతి, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాల నిర్మాణాలకు గౌరవసలహాదారులుగా సేవలందించారు. హైదరాబాద్‌లో చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సిబిఐటి) విద్యాసంస్థను స్థాపించి ఉత్తమ, ఉన్నత విద్యావ్యాప్తికి కృషిచేసిన విద్యావేత్త.

జీవితంలోని నిత్య సత్యాలను మనిషిలోని మానవతను కవితామయం చేసి సామాన్యుడిలా సందేశాన్నిచ్చిన సహజ కవితా శిల్పి బి.యన్.రెడ్డి. అల్పాక్షరాలలో అనల్పార్థ రచన ఆయన ప్రతి కవితలోనూ స్పష్టంగా కనిపిస్తుంది.

1976లో వెలువరించిన "సామాన్యుని సందేశం" 1988లో బి.ఎన్. భాషితాలు, 1993లో బి.ఎన్.భావతరంగిణి Dews of Dawn కవితా సంపుటాలు ఆయనను మంచి కవిగా నిలబెట్టాయి. మానవుడా! మహనీయుడా వంటి గేయాలు అక్షర రూపంలో గాన రూపంలో సాహితీప్రియులకు అందించారు. వీరి రచనలు దాశరథి, సినారె, మల్లెమాల, అరిపిరాల విశ్వం, ముకురాల రాంరెడ్డి, డా॥ జె.బాపురెడ్డి వంటి సాహితీ ప్రముఖుల ప్రశంసలందుకున్నాయి.

వాస్తుశాస్త్రంలో తన అనుభవాలను, ఆలోచనలను సమకూర్చి బి.ఎన్. రాసిన పుస్తకం గ్లింప్సెస్ ఆఫ్ ప్రాక్టికల్ వాస్తు ఎంతో ఉపయోగకరమైనది. ఈ పుస్తకాన్ని తెలుగులో వాస్తు సూత్రాలుగాను, హిందీలో మంగళమయి వాస్తు విజ్ఞాన్‌గా తొమ్మిది భాషలలోకి అనువదించబడి విశేషాదరణ పొందాయి.

మంచి మాటలు చెప్పడానికి మహాకవి కానక్కం లేదు. అలాగే బి.ఎన్.రెడ్డి గుండెను చీల్చుకొని వెలువడిన భావాలను వాక్యాలుగా మార్చి సరళంగా అందించడం తన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈనాడు ప్రతి ఒక్కరూ దేశం నాకేమిచ్చిందని ప్రశ్నించడమే కాని ఈ దేశానికి నేనేమిచ్చాను అని మనం ఆత్మవిమర్శ చేసుకోవడానికి ఈ క్రింది కవితే చక్కని ఉదాహరణ.

**లోకం నన్ను గుర్తించలేదని/వూరికే బాధపడేకన్నా/ లోకాన్ని నేను అర్థం చేసుకున్నానా ?/** అని ఆలోచించడం మిన్న ఆత్మవిశ్వాసం లేనప్పుడు మానవుడు ఎంతటి కార్యమైనా సాధించలేడనడానికి ఈ క్రింది కవితే నిదర్శనం.



సాహితీ మేఖల వజ్రోత్సవాల సందర్భంగా కాళోజీకి సాహితీ రత్న బిరుదు ప్రధానం చేస్తున్న బి.ఎన్.రెడ్డి

**కుంభ వర్షం కురిసినా**
**బోర్లించిన కుండలో నీరు నిలవనట్లే**
**ఆత్మ విశ్వాసం లేని వాడు**
**విశ్వమంతా తిరిగినా వీసమెత్తు సాధించలేడు**

బి.ఎన్.రెడ్డి రచనలు ఆయన వ్యక్తిత్వానికి, మూర్తిమత్వానికి అద్దం పడతాయని నిస్సందేహంగా చెప్పవచ్చును.

**నీ జీవితాన్ని తూచి చూడు**
**నీవు పనిచేసే త్రాసులో**
**ఎంత కాలం చేశావనేది కాదు**
**ఎంత సాధించావనేది ముఖ్యం** అంటున్న బి.ఎన్ జీవితానికి ఒక ఆదర్శాన్ని, ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని తత్సాధనలో తను చేస్తున్న పనిని నిరంతరం బేరీజు వేసుకున్న విశిష్ట వ్యక్తి. అతడు తూకం వేస్తున్నది తాను పనిచేసిన, చేస్తున్న కాలాన్ని కాదు లక్ష్యాన్ని ఎంత వరకు సాధించాలని మాత్రమే బి.ఎన్ భాషితాలన్నీ ఎప్పుడూ ఎవరూ చెప్పని కొత్త ఆలోచనలు కాకపోవచ్చు. ఎప్పుడో ఎవరో చెప్పినవి అందులో కొన్నయినా ఉండవచ్చు.

ఏది రాసినా ఏం లాభం, ఇదివరకెవడో అనే వుంటాడు. బహుశా ఆ అన్నదేదో నా కంటే బాగానే అని వుండొచ్చు అని మహాకవి శ్రీశ్రీ ఎప్పుడో అన్నారు. అలా అనుకొని అనదలచుకొన్న అనకుండా రచయిత ఉండలేడు. రాయకుండా ఉండలేక రాసినవే భాషితాలు. ఈ భాషితాలు భావ సౌందర్య భూషితాలు, సూక్తి మౌక్తికాలు. బి.యన్.రెడ్డి తన 75వ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన భాషితాలలో భగవద్గీత అనే గ్రంథాన్ని రచించారు.

మూడు పర్యాయాలు మిర్యాలగూడ పార్లమెంట్ సభ్యులుగా గెలుపొందిన బి.ఎన్.రెడ్డికి మంత్రి పదవి అందని ద్రాక్షపండే అయింది.

ఆయన స్వయంగా ఒక ట్రస్టును స్థాపించి రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో లబ్ద ప్రతిష్టులైన కవులు, రచయితలను బి.ఎన్ సాహితీ పురస్కారాలతో గౌరవించే సత్సంప్రదాయాన్ని కొనసాగించి ఎందరినో ప్రోత్సహించారు. ఆయన వ్యక్తిత్వం ద్వేషరహితం, ఎవరినీ నొప్పించని విశాల హృదయుడు అందరూ మనవారనుకునే మంచి మనసున్న మనిషి.

జంట నగరాల్లో జరిగిన అనేక సాహిత్య ,సాంస్కృతిక సమావేశాల్లో ప్రముఖ పాత్ర పోషించాడు. హైద్రాబాద్ లోని యువ కళావాహిని వ్యవస్థాపక అద్యక్షునిగా కొనసాగారు.

1976లో విడుదలైన " పెళ్లికానిపెళ్లి" చిత్రానికి ప్రభుత్వం ఉత్తమ కధారచయిత అవార్డుతో సత్కరించింది. ఈ చిత్రానికి మూడు అవార్డులు రావడం విశేషం.

ఒక సామాన్యమైన రైతుకుటుంబంలో జన్మించి విదేశాల్లో విద్యనభ్యసించి ఆర్కిటెక్టర్‌గా, వాస్తుశిల్పిగా, కవితాశిల్పిగా, ప్రజలమనిషిగా, పార్లమెంటు సభ్యులుగా అంచెలంచెలుగా ఎదిగిన బి.ఎన్ రెడ్డి 2017 నవంబర్ 6న అనారోగ్యంతో కన్నుమూశారు.

*(జూన్ 21 బి.ఎన్.రెడ్డి జయంతి సందర్భంగా)*



**-పున్న అంజయ్య**
సెల్:9396610639

---



## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ



### బాల్యపు స్మృతులు

మళ్లీ చిన్ననాటి వీధుల్లో
పరుగులు తీయాలని ఉంది.
అమ్మ పిలుపు వినగానే
అల్లరి నవ్వులు నవ్వాలని ఉంది.
మట్టిబొమ్మలు చేసి
మురిసిపోవాలని ఉంది.
స్నేహితుల గుంపుతో కలిసి
ఆటపాటల్లో మునిగిపోవాలని ఉంది.
ఓడినా గెలిచినా బాధలేకుండా
ఆనందంగా గడపాలని ఉంది.
అమ్మ ఒడిలో తలపెట్టి
కమ్మని కథలు వినాలని ఉంది.
నాన్న చేతి వేళ్లు పట్టుకుని
నిర్భయంగా నడవాలని ఉంది.
పాఠశాల గంట మోగగానే
పరుగెత్తుకుంటూ వెళ్లాలని ఉంది.
విరామ వేళలో మిత్రులతో
చిలిపి కబుర్లు చెప్పాలని ఉంది.
బాల్యపు బంగారు రోజులలోకి
మరొక్కసారి జారిపోవాలని ఉంది.
కాలం దూరం చేసిన క్షణాలను
గుండెల్లో మళ్లీ నింపుకోవాలని ఉంది.
బాధ్యతల భారాన్ని మరచి
బాలమనసుతో నవ్వాలని ఉంది.
ఆడుకోవాలని ఉంది...
ఆ అమాయక బాల్యాన్ని
మళ్లీ ఆస్వాదించాలని ఉంది.

**-నల్లి.సాయి బాబు**

### బాల్యపు జ్ఞాపకాలు

అమ్మ బడిలో ఆదమరచి
ఆ అనుభూతిని పొందాలనీ
నాన్న చిటికెన వేలు
పట్టుకొని ప్రకృతి
అందాలని వీక్షించాలనీ
నాతోబుట్టువులతో కలిసి
చిలిపిగా అల్లరి చేయాలనీ
చింత చెట్టుకు
ఉయ్యాలలు వేసి
ఊగాలనీ
ఆషాడ మాసంలో
గోరింటాకు
అరచేతులకు పెట్టుకుని
ఎర్రగా
పండితే చూసుకుని
మురిసిపోవాలనీ
ఆ దేవుని సన్నిధానంలో
పొగడపూలు ఏరి
ఆ దేవునికి భక్తితో
మాల సమర్పించాలనీ
నా చెలులతోకలసి
జలకాలాడాలనీ
మట్టి పరిమళాన్ని
తనివి తీరా
ఆస్వాదించాలనీ
పలక బలపం పట్టి
బడికి వెళ్ళాలనీ,
అయ్యవారు చెప్పే
నీతి పద్యాలు
కంఠస్థం చేయాలనీ
ఆ బాల్యపు జ్ఞాపకాల్లో
తొంగి చూస్తే
ప్రతి పేజీలో
ఏదో తెలియని
అవ్యక్తాను భూతి
నన్ను నేను మరచిన
ఆ క్షణం. మధురమే.

**-రాచర్ల సులోచన**
హైదరాబాద్

### నా మాట ఆలకించండి

పరుగులు తీయాలని ఉంది ఇంటి గుమ్మందాటి నేస్తాలను కలిసి
ఎగరాలని ఉంది పుస్తకాల బరువును దించి గాలిపటంలా ఎగిసి
కాగితాల పడవలు వదలాలని ఉంది వానజల్లుల్లో తడిస
ఆడుకోవాలని ఉంది నాకు ఆనందంతో నా మది పులకరించే దాక
వానలో తడుస్తూ వానపాటలు పాడుతూ తడవాలని ఉంది
ఆటలకు నన్ను దూరంచేస్తే ఆకురాలిన చెట్టునౌతానేమో మరి
ప్రకృతి ఒడిలో ఆటపాటలతో ఎన్నో నేర్చుకుని ఎదగాలనుంది
అప్పుడే బడిలో పాఠాలు కూడా చక్కగా చదవగలననిపిస్తోంది
చెప్పాడు మానాన్న తన చిన్నప్పుడు జామచెట్టెక్కి కాయలు కోసాడని
అడగాలని ఉందినాకు
నాన్నను నన్నెందుకు ఆరుబయట తిరగనివ్వరని
నుదుటి పైన ముద్దిస్తాడు తొంభైతొమ్మిది మార్కులొచ్చినప్పుడు
మగాడివి కాదా నువ్వు అని గద్దిస్తారు ఆటలలో ఓడిపోయినప్పుడు
సీతాకోక చిలుక రెక్కలు విరిచినట్లు దయచేసి నన్ను కూడా చేయకండి
నా లోకాన్ని బలవంతంగా లాక్కోకండి నా ఆనందాన్ని పాడుచేయకండ
ఆటలే లేని బడి బడికాదు గుడి కాదు అది ఒక బందిఖాన తెలుసుకోండి
ఒక్కసారి నా గుండెసవ్వడి వినండి నన్ను స్వేచ్ఛగా ఆడుతూ ఎదగనివ్వండి
ఆడితేనేగా అలసిపోయేది అలసిపోతేనేగా ఆకలయ్యేది అంతేకదా
అమ్మా నాన్నా ఒక్కసారి
నా మాట ఆలకించండి ఒకగంట ఆడుకోనివ్వండి...
అదే కదా బంగారు బాల్యం అదేకదా భగవంతుడు
అందరికీ ఇచ్చిన వరం...మార్కులు కోసం కాదు
మంచి మార్పులు కోసం అని గ్రహిస్తే నాకు సంబరం...


**-వరలక్ష్మి**
**యనమంద్ర**

### నా కంటి చెమ్మ

ఆడుకోవాలని ఉంది... ప్రతిరోజు నేస్తాలతో
సీతాకోక చిలుకలా ఎగురుతూ తృళ్ళుతూ
ఆస్వాదించాలని ఉంది
బరువు బాధ్యతలు లేని ఈ బంగారు బాల్యాన్ని
తనివారా ఆటపాటల నడుమ గడపాలని ఉంది
మళ్లీ తిరిగిరాని ఈ అద్భుత క్షణాలను బాల్యం సైతం
విస్తుపోయేలా దోసిళ్ళతో తనివితీరా గ్రోలాలని ఉంది
కానీ అమ్మ ఎందుకో పంపడం లేదు...
నా అలకను ఆవేదనను అసలు పట్టించుకోవడం లేదు
బయటికెళ్తే చాలు...
మానప్రాణాలను బలి తీసుకునే మృగాళ్లు పొంచి ఉన్నారనీ
మంచివారిలా నటిస్తూ అడుగడుగునా కామాన్ని కళ్ళల్లో నింపుకున్న
కీచకులు ఉన్నారనీ ఎటువెళ్లినా వదలని రాహు కేతువుల్లా
జీవితాన్ని కబళించే నరరూప రాక్షసులు ఉన్నారనీ
పసివారని కూడా కనికరించక వావివరుసలు మరిచి
కాటేసే కామాంధులు ఉన్నారనీ
చిరుమొగ్గలను చిదిమి బతుకును బుగ్గిపాలు చేసి
కాలరాసే కాలకేయులు ఉన్నారనీ
ఇంటినే జైలుగా చేసింది...
బయటికి పోనీకుండా అనుక్షణం వేయికళ్ళతో కాపలా కాస్తుంది
గ్రహణం పట్టిన జాబిలిలా నేను... గత్యంతరం లేని పరిస్థితులలో
కుమిలిపోతున్న అమ్మ
ఆడుకోవాలన్న కనీస ఆశను తీరుస్తూ,
ఏ కరమైనా తుడుస్తుందా నా కంటి చెమ్మ

**-ఎస్. రత్నలక్ష్మి**
నంద్యాల

---





తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

-సంపాదకులు

### పూసలదండ

చెయ్యెత్తి జై కొట్టినా
తల వంచి నమస్కరించినా
అంతా నా చలువే.
కంటికి కనిపించను
కనువిందు చేయను
కానీ నీ కలల సాకారానికి
కేంద్ర బిందువును.
అంతరాలకు నేను వ్యతిరేకం
లింగభేదాలకు నేను అతీతం.
ప్రాంతీయతలు నాకు పట్టవు
స్వపరాలు నాకు గిట్టవు.
తెర వెనుక సూత్రధారినై తెరమీద
పాత్రధారులను నడిపిస్తుంటాను
నేను మౌనముద్రలో ఉండి
నిన్ను శబ్దభేదిని చేస్తాను
నేను నిశ్చలంగా ఉండి
నిన్ను చలనశీలిగా మారుస్తాను.
నాతో చెలిమి నల్లేరుపై నడకే
నాతో వైరం అసలుకు ఎసరే.
మోయలేని బరువును మోపి
మొరాయించానని నిందించకండి
అడుసులో కాలేసి నెపం నాపై నెట్టకండి
అధర్మాన్ని ఆశ్రయించి
నన్ను అపరాధిని చేయకండి.
పరుగుల పయనంలో
అలసిన నాకు కాస్త విశ్రాంతి నివ్వండి
ఇంతకీ నేనెవరినని అంటారా?
సూత్రాలకు లోబడి
నియమాలకు కట్టుబడి
పడవ నడిపే సరంగును
విధాత రచనలోని ఓ అద్భుతాన్ని
షట్చక్రాలకు ఆధార బిందువును
72 వేల దారాలతో కూర్చబడిన
33 పూసల దండను
(మానవ శరీరంలోని వెన్నెముకపై అల్లిన కవిత)

**-పద్మశ్రీ చెన్నోజ్వల**

### విశాల హృదయపు తీరు

ఒక వైపు
పేదరికపు ఎడారులు
మరో వైపు
ఎడతెగని దనదాహపు వరదలు!జ
నదులు ఎన్నో ఉన్నా
నేటికీ నీటి కొరతలు
ఎన్నో ఎకరాల నేలలు
అయినా రైతుల ఇరుకు బ్రతుకులు!.
ఆకలి తిప్పలు ఒకవైపు
ఆస్తుల కుప్పలు మరోవైపు
ఆగని కన్నీటి దారలు
ఆరిపోని ఆకలి మంటలు!.
ఉద్యోగాలు లేక యువత
కళ్ళు తెరిచి నిద్రబోతున్న నేతలు
నిరుద్యోగులు ఉద్యమ బాట పట్టకముందే
నేతలు దిద్దుబాటు చేపట్టాల్సిందే!.
నాగళ్ళు ఆకాశం వైపు చూస్తున్నాయి
వ్యవసాయానికి సాయం అందిస్తే
నేలలు పండుతాయి
కడుపులు నిండుతాయి!
భయం గుప్పిట్లో కలాలు
కలాలకు స్నేహ హస్తం అందిస్తే
మెదళ్ళు పండుతాయి
కొత్త ఆలోచనలు మొలకెత్తుతాయి!
నీకున్నది కొంతయినా పంచుకో
అంతా నీ సొంతమే అనుకోకు
ఒక్కడివే శిఖరం చేరితే
నీ వెనుక ఒంటరి నీడనే!
విశ్వమంతా పరుచుకున్న ప్రకృతి
విశాల హృదయపు తీరు అది!!

**-జగ్గయ్య.జి, 9849525802**

### కరువు రాజ్యం

నీటి కోసం మళ్లీ కుండలో
కాకి గులక రాళ్లు వేస్తోంది.
నీళ్లు పంటల పారకానికి పైకి రాకుండా
పాతాళానికి దిగి పోతున్నాయి.
ఇక్కడి పక్షులు నీరున్న చోటికి
వలస పోతున్నాయి.
ఆకాశంలో అన్నీ
నీరు లేని మబ్బులే!!
కిసాను కన్ను మాత్రం నీరు నీరు.
అందరి కన్నులు ఆకాశం వైపే
కరువు ఇక రాజ్యాలు ఏలుతుందేమో.
ఇపుడే నాయకులు తమ బలగంతో
చెట్లు నాటుతామంటున్నారు
ఇప్పటికిప్పుడు మేఘాలు
మరి ఎక్కడి నుండి.

**-కందాళై రాఘవాచార్య**
8790593638




### దీర్ఘ దినం ప్రపంచయోగ దినం

ప్రకృతి స్వభావం చైతన్యత్వం
ప్రకృతికి ఉండదు పక్షపాతం
ప్రకృతి పాటించు కచ్చితంగా
ప్రకృతి చూపించదు తారతమ్యం!.
రాత్రి - పగలు సమానాలు
అవి మార్చ్ 21, సెప్టెంబర్ 23లు
దీర్ఘ రాత్రి - దీర్ఘ పగలు
అవి డిసెంబర్ 23 - జూన్ 21లు!.
యోగ అరిషడ్వర్గాలు జయించు
అష్టాంగ మార్గాలు అనుసరించు
చిత చింతల వ్యదను తొలగించు
ఆయురారోగ్యాలు పెంపొందించు!.
నమో యోగ మంత్రం సమ్మోహనం
విశ్వం విశ్వసించే మన యోగ ఫలం
ఉత్తరాయన దీర్ఘ (జూన్ 21)దినం
అయ్యింది ప్రపంచ యోగ దినం!
(జూన్ 21, ప్రపంచ యోగ దినం)

**-పట్లొళ్ళబక్కారెడ్డి**
9705315250

### సరి చేసే బాధ్యత ఎవరిది...?

స్వేచ్ఛా పక్షిలా విహరిస్తూ
ఆనంద ఊయలల్లో ఊగుతూ
కల్మషం ఎరుగని మనసుతో
ఆశా?నిరాశల అంచులు తాకక
కాలపు ఒడిలో పెరిగేది
నాటి బాల్యం.
నేడు?
"మమ్మీ, డాడీ" సంస్కృతి నీడలో
మర మనుషుల చేతుల్లో పెరిగి నట్టు,
ఆత్మీయతకు అనురాగానికి
దూరమవుతున్నది బాల్యం.
సెల్‌ఫోన్ల వెలుగుల్లో,
టీవీల రంగురంగుల మాయల్లో
మానసిక వికృతుల వలలో చిక్కుకొని,
మంచి-చెడుల మధ్య రేఖ చెరిగి,
ప్రేమను, ద్వేషాన్ని, అశ్లీలతను
ఒకే గిన్నెలో కలిపి తాగుతూ,
మత్తు మాయల ప్రేరణలో
తనను తాను కోల్పోతున్నది బాల్యం.
చట్టాలు ఎన్ని వచ్చినా,
సంస్కృతికి తూట్లు పొడిచే
అధికార మదం ముందు
అవి నిస్సహాయాలై నిలుస్తుంటే?
ఈ రాక్షస ప్రవృత్తికి



మార్పు ఎప్పుడొస్తుంది?.
తల్లి, చెల్లి, అన్న, అక్కల
అనుబంధాలు శిలాఫలకాలై,
విశృంఖలత వీధుల్లో
విలువలు దారి తప్పగా,
ముక్కుపచ్చలారని వయసులోనే
మోహావేశాల మంటల్లో కాలి,
నరత్వం మరచిన అడుగులతో
తిరుగుతున్నది నేటి బాల్యం.
బాగు చేసే నాథుడెవ్వడు?
భరిస్తూనే ఉన్న సమాజంలో
సంస్కరణాగ్నులు లేచేదెన్నడు?
మనం అంటే సమాజమే
సమాజం అంటే
మనమే అయినప్పుడు
తప్పెవరిదో వెతకడం కాదు?
తప్పును సరిచేసే బాధ్యత
మనదే.

**-నర్సింగోజు లక్ష్మయ్య**
9866152371.

---



## కవితార్చన

అడ్మిన్: **డా॥రాధాకుసుమ**
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది.
అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

-సంపాదకులు

### జీవన పయనంలో ధైర్యంగా సాగాలి

జీవితం సుఖ దుఃఖాల సాగరం
అన్నింటిని తట్టుకుంటూ పోవాలి
బాదలొచ్చాయని భయపడకూడదు
ఓటమి ఎదురవుతుందని ముందే ఊహించి..
లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నం నిలపకు
అడ్డంకులు ఎన్ని ఎదురైనా ఆపకు నీ పయనం
నడిచే దారిలో ముళ్ళు రాళ్లు ఉన్నాయని
పూల బాట కాదు అని బాధపడుతూ కూర్చుంటే
విజయం నీ సొంతం కాదు ఎన్నటికీ
కష్టాలు కలకాలం ఉండవు అనుకుని
ముందుకు సాగుతూ పయనిస్తూ..
సుఖాల తీరం చేరుతావు అని నమ్మకం పెంచుకుని
బాధ్యత మరువక నీ వాళ్లకు భరోసాగా నిలిచే ప్రయత్నంలో..
ఆటుపోట్లు ఎన్ని ఎదురైనా చింతించకు.
కడుపున పుట్టిన వారిని కాచుకునేందుకు
ఇన్ని బాధలా అని తల పట్టుకోకు
కాచిన చెట్టుకే కదా కర్ర దెబ్బలు
అందుకే..
జీవన పయనంలో సుడి గాలులు ఎన్ని వచ్చినా బెదరక..
కట్టె కాలే వరకు నిజాయితీగా నిలవాలి.
అపుడే మనకు సమాజంలో మంచి స్థానం లభిస్తుంది.

**-మోదేపల్లి శీనమ్మ**
+91 97048 54615

### ఆది దేవత

ఆది దేవత అమ్మ...
నా చేత తలరాతను మార్చేఅక్షరాలు దిద్దించిన శారదాదేవి,
నా భవితకు కలలుగన్న బంగారుబాటను సిద్ధం చేసిన పార్వతిదేవి,
నాలో అజ్ఞానమనే అంధకారాన్ని రూపుమాపిన సరస్వతీదేవి ,
నా విజ్ఞానానికి అవధులు లేని గమ్యం వేసిన గురువు,
నా మేధో సంపత్తికి అంతేలేని పరీక్షలు పెట్టిన ఉపాధ్యాయిని,
నా జీవన ప్రమాణాలకి ఊహించని ప్రతిఫలం చూపిన తత్వవేత్త,
నా ఆలోచనా సరళిని సన్మార్గంలో నడిపిన దిక్సూచి,
నా ఆవేదనా తరంగాల గమనం మార్చిన శ్రేయోభిలాషి,
నాకు ప్రేమానురాగాలు పంచే వారధిగా మారిన ఆత్మీయపెన్నిధి,
నాకు వెల కట్టలేని ఆదరాభిమానాలను పంచే ఆత్మీయురాలు,
నా అలసటలో విసిగి వేసారకుండా అక్కున చేర్చుకున్న కల్పతరువు,
నా ఆనందంలో తన వంతు పాలు పంచుకున్న స్నేహితురాలు,
నా కవితా దృక్పధానికి చక్కని పునాది వేసిన కామధేనువు,
నా కవితల పూలకు పరిమళాలద్దిన తోటమాలి,
నా ఊహలకు ఊపిరి,
నా ఆశలకు ఆయువు... అన్నీ అమ్మే.... ,
నన్నే నాకు కొత్తగా పరిచయం చేసిన అమ్మా...!
నీకిదే నా వందనమమ్మా...
నా అక్షర నీరాజనం అందుకొనుమమ్మా...!!

**- భూపతి సుమశ్రీ**
+91 85007 89389

### విధిచేతిలో వింత. బొమ్మలు

ఇంటినే వదిలారో
దూరంగా విసిరేయబడ్డారో
నిత్యం కన్నీటి కడవలైన నేత్రాలు
కదిలిస్తే అశ్రువుల గాథలు..
నగరాల్లో, వీధి కూడళల వద్ద..
ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తారు..
చిరిగిన మాసిన దుస్తులతో..
అట్టలు కట్టిన శిరోజాలతో..
దీనంగా చేతులు చేస్తూ..
భిక్షాటన చేస్తూ లేదా దొంగతనాలు చేస్తూ..
కనిపిస్తారు వీధి బాలలు..
తల్లిదండ్రుల అక్రమ సంతానమో..
ముష్టి వాళ్ల చేత చిక్కిన విధి వంచితులో..
రోడ్డు మీద చెత్త ఏరుకుంటూ..
రకరకాల వస్తువులు అమ్ముతూ..
కార్మికులుగా పని చేస్తూ కనిపిస్తారు..
మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు లోనవుతారు..
మత్తులో నేరాలు, ఘోరాలు చేస్తారు..
సరియైన తిండి, నిద్ర వుండదు..
అపరిశుభ్రత వలన అనారోగ్యం పాలవుతారు..
నిరంతరం అభద్రత, మానసిక ఆందోళన..
ప్రభుత్వం, ప్రజలు కలిసి వీరి బాధ్యత తీసుకుని..
భద్రత కల్పించి, చదువు నేర్పించి..
సమాజానికి పనికి వచ్చేలా తయారు చేయాలి..

**-పంతుల లలిత**
+91 82477 57492

### మన చేతల్లోనే ఉంది అంతా

పచ్చ పచ్చని చెట్లతో
గలగల పారే నదులతో
కిలకిల రావాల పక్షులతో
పుడమి పాడింది ప్రకృతి రాగం నాడు.
యంత్రాల ఘోషల్లో
కాలుష్య కోరల్లో
ప్లాస్టిక్, విషవాయుల కౌగిట్లో
పుడమి నలుగుతుంది నేడు.
మనుషిలో పెరిగే స్వార్థం
చెట్లను నరుకుతున్నాడు
అడవులను ఆక్రమిస్తున్నాడు
నదులను కాలుష్యం చేస్తున్నాడు.
జాలువారే జలపాతాలు
కనుమరుగాయే
ఋతువుల రాగం గతితప్పే
పకృతి పగపట్టే.
నాణానికి ఇరువైపులాన్నట్లు
హరిత శోభ ఓవైపు
మసిబారిన మసక ఓవైపు
మన చేతుల్లోనే ఉంది
పుడమి తల్లి ఆయతి.
చెట్లను నాటు కాలుష్యం నివారించు
నదీ జలాలు కాపాడు
ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టు
జీవజాతులను కాపాడు
ఓ మనిషి స్వార్థం వీడు.
పకృతితో మమేకమవ్వు
స్వచ్ఛమైన గాలులు పీలుద్దాం
భవిష్యత్తరాలకు అందిద్దాం

**-చాగంటి రాణి**
+91 83677 49366

### కలల సౌధము

కలలతో మొదలవుతుంది ప్రతి ఉదయం,
ఆశలతో నిండిపోతుంది ప్రతి హృదయం.
చిన్న కల అయినా చిగురించే దీపమై,
మన జీవిత మార్గానికి వెలుగై నిలుస్తుంది.
కలలు కేవలం నిద్రలో వచ్చే చిత్రాలు కావు,
మన గమ్యానికి దారి చూపే నక్షత్రాలు అవి.
పడి లేస్తూ సాగిన ప్రతి అడుగులో,
విజయపు సౌధాన్ని నిర్మించే శిల్పాలు అవి.
ఒక రైతు కలలో పచ్చని పంటలుంటాయి,
ఒక విద్యార్థి కలలో
వెలుగైన భవిష్యత్తుంటుంది.
ఒక శాస్త్రవేత్త కలలో కొత్త ప్రపంచముంటే,
ఒక కవి కలలో
మానవత్వపు సంగీతముంటుంది.
కలలే మనసుకు రెక్కలు ఇస్తాయి,
కష్టాల సముద్రాన్నీ దాటించే పడవలవుతాయి.
ఆత్మవిశ్వాసం అనే గాలి వీచినప్పుడు,
అవి విజయ తీరాలకు తీసుకెళ్తాయి.
కలలు కనని జీవితం వెలుగులేని దీపం,
లక్ష్యం లేని ప్రయాణం దారిలేని నావం.
కలలే మనిషిని సాధారణం నుంచి
అసాధారణ శిఖరాలకు చేర్చే మెట్లు.
అందుకే యువత హృదయంలో
కలలు మండాలి,
అవి దేశ భవిష్యత్తుకు దివ్యజ్యోతులవాలి.
ప్రతి కల ఒక కొత్త ఉదయాన్ని పిలుస్తూ,
మన భారతాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దాలి

**-కె. కె. రామచందర్**
.+91 94934 02139

# సప్త పదములు

ప్రక్రియా సృజనకర్త: సుధామ



నాయకుడు,
గాయకుడు,
సరైన సంపాదన
లేకుంటే
ఔతాడు
నష్టదాయకుడు.
-చెరుకుపల్లి గాంగేయ శాస్త్రి

రోషాలు
ద్వేషాలు
అంతంత మాత్రం
బంధాలతో
అవసరమా
పౌరుషాలు..!!
-శ్రీమతి భారతీకృష్ణ హైదరాబాద్

చదవాలి
కొలవాలి
పిల్లలు
మంచిగ మెలగాలి
గొప్పగ
వెలగాలి .
-మా. శ్రీ. రాజు పాల్వంచ

బాధిస్తుంది
శాంతిస్తుంది
కాలమే
గొప్ప గురువు
మనకన్నీ
బోధిస్తుంది
-సరోజ రెబ్బాప్రగడ బెంగుళూరు

ఘోరం
దూరం
మమతలు లేని
మానవ
సంబంధాలు
పెనుభారం..
-పద్మావతి పి. హైదరాబాద్

అక్షితం
రక్షితం
పరుషమైన
పలుకుల కన్నా
మౌనం
సురక్షితం
-విత్తనాల విజయకుమార్

## ఏకాపద్మ స్మారక పురస్కారం ప్రదానం



భవానిని సన్మానిస్తున్న అతిథులు

హైదరాబాద్, జూన్ 24: శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో శుక్రవారం రాత్రి ఏకాపద్మ స్మారక పురస్కార ప్రదానం సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ పారిశ్రామికవేత్త పి. పవన్‌కుమార్ పురస్కారాన్ని ప్రముఖ హోమియో వైద్యులు డా॥భవానికి బహూకరించి ప్రసంగించారు. భార్య మరణించి ఎన్నో సంవత్సరాలు గడిచినా ఆమె స్మృతులను మరువలేక భర్త రామ మోహన రావు ప్రముఖులకు ప్రతి ఏటా పురస్కారం ప్రదానం చేసి ఆమెకు శాశ్వతంగా నిలిపార న్నారు. సాహితీ కిరణం మేనేజర్ పొత్తూరి జయలక్ష్మి, పద్మ ఆప్టికల్స్ ఏకా నాగరాజు, రామమోహన రావు, కామేశ్వరి, పొత్తూరి సుబ్బా రావు, పెద్దూరి వెంకటదాసు తదితరులు పాల్గొనగా కిరణ్ సంస్థ అధ్యక్షుడు లంకా వెంకట సుబ్రహ్మణ్యం సభా పర్యవేక్షణ చేశారు. ఏకధర్మ సంవర్ధిని వందన సమర్పణ చేశారు.

# చేపలకు సాయం

(కథ)



సుందరవనం అని అడవిలో మృగరాజు సింహం దగ్గర ఒక నక్క దాని బంటుగా ఉండేది . అది ఒకసారి సింహంతో "మృగరాజా! నాకు మాంసం మీద విసుగు పుట్టింది. మన అడవిలోని ఒక కొలనులో ఉన్న చేపలను నాకు తినాలని ఉంది . అందుకు నాకు మీ అనుమతి కావాలి "అని అడిగింది . సింహం అందుకు సరేనంది .

ఆ నక్క మరుసటి రోజు నుండి ఆ అడవిలో ఉన్న కొలనులన్నింటిలోని చేపలను తన ఇష్టం వచ్చినట్లు తినసాగింది. కొన్ని చేపలు భయపడి నీటి అడుగుకు వెళ్లి తప్పించుకున్నాయి.

ఒకరోజు కుందేలు నీటిని త్రాగడానికి ఒక కొలనుకు వచ్చింది. అప్పుడు కొన్ని చేపలు పైకి వచ్చి" కుందేలు మామా! మమ్ములను నక్క స్వాహా చేస్తున్నది. అందుకే మా సంఖ్య తగ్గింది. దానిని అడిగితే అది మృగరాజు తనకు అనుమతి నిచ్చిందని అంటున్నది. నీవే ఎలాగైనా ఆ నక్క బారి నుండి మమ్మల్ని కాపాడాలి" అని కుందేలును ప్రాధేయపడ్డాయి. కుందేలు వాటికి అభయం ఇచ్చింది.

ఆ తర్వాత కుందేలు మృగరాజు వద్దకు వెళ్లి "మృగరాజా! మన అడవిని చూడడానికి ప్రక్క అడవి సింహం మనకు అతిథిగా వస్తున్నదట . దానికి మనం అతిథి మర్యాదలు చేయాలిగా! దాని వద్ద ఉండే మంత్రి నక్కకు చేపలు చాలా ఇష్టమట. వారి అడవిలో చేపలు దొరకవట. మీరు చేపల పులుసు దానికి విందుగా ఇవ్వాలట . ఆ పొరుగు అడవి సింహం నాతో చెప్పింది . అందువల్ల ఆ మృగరాజు తన మంత్రి నక్కకు ఇక్కడ కచ్చితంగా చేపల విందును ఇమ్మని కోరింది " అని చెప్పింది.

అది విన్న సింహం "మన కొలనులలో బోలెడన్ని చేపలు ఉన్నాయిగా! వాటి విందును ఏర్పాటు చేస్తే సరి !"అని అంది. అప్పుడు కుందేలు " మృగరాజా! మన అడవిలోని కొలనులలో మనకు సరిపోయే చేపలు లేనే లేవు . వాటన్నింటినీ మన నక్క స్వాహా చేసింది . మీరే దాన్ని అనుమతించారట" అని అంది . అది విన్న సింహం కోపంతో అది రానీ. దాని సంగతి చెబుతా! సరేగానికుందేలా! మరి ఇప్పుడు ఆ పొరుగు సింహం ముందు మన పరువు ప్రతిష్టలు మంట గెలవడమేనా !"అని అంది . అది విన్న కుందేలు "మృగరాజా! మీరేం భయపడకండి. ఎలాగైనా ఆ సింహం పర్యటనను నేను వాయిదా వేయిస్తాను" అని చెప్పింది. సింహం ఎంతో సంతోషించింది.

ఆ తర్వాత మరునాడు కుందేలు వచ్చి మృగరాజు తో "మృగరాజా! నేను ఆ పొరుగు అడవి సింహం పర్యటనను వాయిదా వేయించాను. మా వద్దనున్న చేపలు చాలా చిన్నగా ఉన్నాయని , అవి కొంచెం పెద్దగా అయిన తర్వాత మీ నక్క కోరిక తీరుస్తామని చెప్పాను. అందుకు అది సరేనంది. మరి మీరు ఆ మిగిలిన కొలనులోని కొన్ని చేపలను నక్క తినకుండా చూడండి "అని అంది .

సింహం నక్కను పిలిచి గట్టిగా మందలించింది . కుందేలు చేపల వద్దకు వచ్చి "ఓ చేపలారా! ఇక నక్క మీ జోలికి రాదు. మీరు భయపడకండి"అని విషయం చెప్పింది. కుందేలు ఉపకారానికి ఆ చేపలు ఎంతో సంతోషించాయి.

-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య
9908554535



---

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1803వ రోజు **'అన్వేషణ'** అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. **'అన్వేషణ'** అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839



### అర్ధరహిత అన్వేషణ

గుడ్డులో బిడ్డని వెతకాలని
గడ్డులో ఒడ్డుకి చేరాలని
ముద్దులో చేదుని వెతకాలని
పొద్దులో చంద్రుణ్ణి చూడాలని.
కవ్వం లేకుండా
వెన్నని తీయాలని
మద్యం లేకుండా మత్తు కలగాలని
ఇంధనం లేకుండా ఇంజను నడపాలని
వైద్యం లేకుండా రోగం తొలగాలని
పద్యం లేకుండా కావ్యం రాయాలని.
చావు రాకుండా బతుకు సాగాలని
స్వరం లేకుండా గాత్రం చేయాలని
వైరం లేకుండా సమరం జరగాలని.
అన్వేషణ అన్వేషణ కొరకే అనుకుని
అర్థం లేని వ్యర్థ ప్రయాసల అన్వేషణ
ఎవరికి కావాలి?
ఎందుకు కావాలి?.
దాహమేస్తే నీటి అన్వేషణ
ఆకలి ఉంటే ఆహార అన్వేషణ
బతుకుతెరువు కొరకు ఉద్యోగాన్వేషణ
రోగ బాధల నివారణకు చికిత్సాన్వేషణ
మోక్ష సాధనకొరకు ఆరాధనల అన్వేషణ
సబబు
అవసరం
ప్రయోజనం.

-రాజప్ప

### శోధన

పుట్టిన దగ్గరి నుండి గిట్టేదాకా
నరుని బతుకు వెతుకులాట
పెనుగులాట
విధిచేతిలో తొక్కిసలాట
శోధించు
పరిశోధించు
అంతు తేల్చేదాకా వేధించు.
సీతాన్వేషణలో
రామలక్ష్మణుల పయనం
లంకజేరి హనుమ
వెతికి వెతికి వేసారి
అశోకవనంలో
సీతమ్మను గాంచిన వైనం.
సౌగంధికాపుష్పం కోసం
భీముని అన్వేషణ
కలిసె హనుమన్నను
తమ్ములకై అన్వేషించి ధర్మరాజు
యక్షప్రశ్నలకిచ్చిన జవాబులు
సర్వదా శిరోధార్యం!.
కొత్త సముద్రమార్గాల అన్వేషణతో
కొలంబస్ అమెరికాను
వాస్కోడిగామా భారత్ చేరిక
మార్కోపోలో చైనాయాత్ర
అలెగ్జాండర్ కాంక్షతో యుద్ధాలు.
ఛార్లెస్ డార్విన్ పరిశోధనలు
ధ్రువాల అన్వేషణలో విజయం
రష్యా అమెరికా అంతరిక్ష
యానాలు
భారత్ చంద్రమండలంపై
జయగీతం.
సముద్రంలో గవేషణతో ముత్యాలు
నేడు శిశోదయంతో ఆరంభం
నర్సరీలోనే
కంప్యూటర్ కోచింగ్ ఇచ్చే బదులకి
తలతాకట్టుపెట్టి
బుడతను చేర్చే ఉపాయం కోసం
ఉద్యోగాన్వేషణ
వరాన్వేషణ
నేడు వధాన్వేషణతో
పెళ్లికాని అబ్బాయిల
అమ్మానాన్నలు.

-ఎ.రాజ్యశ్రీ

### చీకట్లో చిందులాట

మనిషి పుట్టుకతో
ఏడ్చే ఏడుపు అన్వేషణ.
నా బంగారు పాన్పు
అమ్మకాన్పుతో కనపడలేదంటూ
అన్వేషిస్తాడు చిన్ని కూన.
అడవిలో ఆరంభమైన అన్వేషణ
అంతస్తులపై
అంతస్తులుగా ఎదిగి
అణ్వాయుధ కర్మాగారాలతో
ఆటలాడుకుంటున్నది.
జీవుల పుట్టుకతో
దవ్వుల చేరిన వెతుకులాట
చివరిదాకా చెదరిపోని
ఆత్మబంధువు.
ఎంత చెట్టుకంత గాలి.
పొట్టకూటి అన్వేషణ
నిత్యాన్వేషణ
అతడే అచ్చమైన అన్వేషి
అది నిరంతరాన్వేషణ.
వంట ఇంటి ఇల్లాలికి
నిరంతరం కూరల ఎన్నికలో
ఉపాహార తయారీలో అన్వేషణే.
అన్వేషణ ఫలిస్తే మెచ్చుకోళ్లు
లేకపోతే దూషణలే భూషణాలు.
డబ్బుంది కదా అని
ఒక్కో ఇంట్లో నాలుగు కార్లు
మూడు స్కూటర్లు
మరి వీటికి ఆయిల్
ఎక్కడ
అందుకే దీర్ఘ అన్వేషణ.
కమితకు ఎప్పుడు కాంత
అన్వేషణే.
రిక్తుడు రిక్తహస్తుడై
భుక్తికి సతతాన్వేషణుడే
పరిశోధనాచక్రవర్తులకు
పట్టా పుచ్చుకున్నదాకా
వస్తువులో తలమునిచి
అన్వేషించడమే
అన్నం కూడా సున్నానే.
పశువులు
పక్షులు
విశ్వంలో
ప్రతి జీవి అన్వేషణతోనే
ఆశయాల అంచులు
తాకుతాడు.
అందుకే
అన్వేషణ
అందుగలదిందు లేదని
సందేహము వలదు
జీవి సర్వావస్థలలో
నెచ్చెలిగానిలిచి
వానికి రక్షణ నిచ్చున్.

-డా.సి.వసుంధర

### నవీనతకై వెతుకులాట

అన్వేషణ అనేక విధాలు!
గుడ్డులో పిల్లను వెతకడం
ప్రకృతి అందాలు తిలకించడం
పక్షుల కుహ కహలు వినడం
జలపాతాల హోరు వినడం
ఆల్చిప్పలో ముత్యం కనుగొనడం
ఉద్యోగం కోసం నిరుద్యోగి వేట
వధువు కొరకు వరుని అన్వేషణ
పెరుగు చిలికి వెన్న తీయడం
పాలసంద్రంలో అమృతాన్వేషణ
దాహం కోసం నీరు వెతకడం
చికిత్సకై వైద్యుని వెతకడం
మోక్షానికై దైవారాధనలు
నిధి నిక్షేపాలకై వెతుకులాట
ఆదిమానవుని ఆహారాన్వేషణ
నిప్పు కనుగొనుటకై ప్రయత్నం
ఆయుధ తయారీకి అన్వేషణ
కృత్రిమ మేధ కోసం ప్రయత్నం
సేంద్రియ ఎరువులతో పంటలు
సీత కోసం రాముని అన్వేషణ
సౌగంధికకై భీముని పాట్లు
ఇవన్నీ అన్వేషణలో ప్రక్రియలే!!.

-కోలా సత్యనారాయణ

### ఎరుక

జీవితమందన్వేషణ
కావలె ప్రతియొక్కరును కాలపు నడతన్
సేవలునవసరములతో
భావికి తమ ప్రతిభదెలుప వైవిధ్యముగన్!!.
మనసులవెదుకుటనెరుకగ
మునిమౌనులుచెప్పియుండ్రిమోక్షముకొరకై
తనువులనునికి నిరక్షణ
కనుకూలపు వెతుకులాటనావశ్యంబ.
పంచేంద్రియములపని శో
ధించగ ప్రతి నిత్యమొక్క దీక్షగ గొనియా
శించినఫలములపలుద
ర్శించగనన్వేషణలను శీఘ్రము గనుమా.
చరవాణులు కంప్యూటరు
ధరణినిగల కృత్రిమమగు
దారులలోనన్ విరివిగనన్వేషణలో
మరువకుమీ మానవతను మైత్రిని మదిలో.

-మాడుగుల నారాయణమూర్తి

### మాటల్లో చెప్పలేనివి

ప్రతి దానికి కావాలి అన్వేషణ
ఏది చదివితే మంచిదో
అన్వేషణ మొదలు.
ఏం చేస్తే ఏమవుతుందో
అన్వేషణ.
మహిళలు తమకు
తెలియకుండానే
చేస్తారు అన్వేషణ తమ వంటల్లో
కొంతమంది తెలిసిన వంట కాక
వేరే ప్రయత్నిస్తారు.
అది మరి అన్వేషణే కదా!.
చాలా మంది విద్యార్థులు
డాక్టరేటు కోసం పరిశోధనలో
భాగంగా చేస్తారు అన్వేషణ
అన్వేషణ చేస్తారు-
కుట్టేందుకు దర్జీ
రాసేందుకు రచయిత
కొంతమంది ఆటల్లో
కొంతమంది సంగీతంలో
కొంతమంది నృత్యంలో
కొంతమంది తమ కళల్లో.
అన్వేషణతో
కొత్త విషయాలు తెలుస్తాయి.
చేసిన వారికి సంతృప్తి
ప్రయత్నం చేసినప్పుడు
విజయం సాధిస్తే
వచ్చే సంతృప్తి
సంతోషం
మాటల్లో చెప్పలేనివి.

-డా.షహనాజ్ బతుల్

### నీరాజనాలు

పనిముట్ల పరిశీలనలతో
పచ్చజండా ఊపింది
నాగరికతకు
రాతి గుహల నివాసం కాస్త
రాజభోగాలకు దారి వేసింది.
అత్యవసరాలను సాధించి
అవసరాలను తీర్చుకుంటూ
విలాసాల విల్లు రాసుకున్నాడు
కులాసాల మానవుడు.
నాగరికతలో నడక నేర్చుకుని
యాంత్రికతలో కొట్టుమిట్టాడి
పారిశ్రామికతలో పరుగు
లంఘించి
సాంకేతికతల కనుసన్నల్లో
కృత్రిమ మేధలో అడుగిడినాడు.
పంటలెక్కువ పండించాలని
పరిశోధించాడు రసాయనాలను
పశువులతో చేసే పనులను
యాంత్రికతతో ముడిపెట్టేశాడు.
చెట్లల్లో అంట్లు కట్టాడు
చేలల్లో పుట్లు పండించాడు
పాలల్లో సమృద్ధిని సాధించాడు
కూలోళ్లు లేకుండానే పనులు
కానిస్తున్నాడు.
నిత్యవిద్యార్థియై నిలిచె
నిరంతర పరిశీలన జరిపె
నిర్విరామకృషి సలిపి నేడు
నీరాజనాలందుకుంటున్నాడు.

- నగునూరి రాజన్న

### నేను

స్వీయస్మృతి అవగాహన లేక
తనను తాను గమనించక
సర్వ వేద శాస్త్రములు
స్వరయుక్తంగా పఠించినా
సకల సత్కర్మలు ఒనరించినా
ఉపశమన శాంతి తప్ప
మనోనిశ్చలతకు
సోపానాలుగా తప్ప
నేను గురించిన అన్వేషణకు
సహకరించలేవు!.

-చంద్రకళ దీకొండ

---

### తోడు నీడ

నన్ను క్షణం కూడా విడవక..
సదా నా వెంట నడిచి..
ఎన్నడూ ఎదురు తిరగని..
ఎప్పుడూ ప్రశ్నలు అడగని..
అలసట అసలే ఎరుగని..
అవిభాజ్య ఆత్మీయ నేస్తం నీడ !

నా కష్టసుఖాల్లో తోడై ఉంటూ..
మాటలే రాని సైగల ఆకృతి..
చీకట్లో నాతో పాటు విశ్రమిస్తూ..
వెలుగులోకి రాగానే ప్రత్యక్షమై..
మలి సంధ్యలో నన్ను వీడి..
నా ప్రాణ మిత్రుడైంది నీడ !

బేషరతు అనుబంధాలతో..
నాతో కలిసి శరీర కదలికలు
కుడి ఎడమల ప్రదక్షిణలు చేస్తూ..
పొడుగు పొట్టి వేశాలు వేస్తూ..
సూర్యుడి ఆదేశాలు మన్నిస్తూ..
చీకట్లో తుర్రుమని జారుకునే నీడ !

నీడ తనదైన ఓ నిర్దిష్ట ఆకారంతో..
తన ఆకృతిని మార్చుకుంటూ..
నేను నిలిస్తే తాను నిలుస్తూ..
నేను కూర్చుంటే తాను కూర్చుంటూ..
కాలరెగిరేస్తే తాను కూడా కాపీ కొడుతూ..
నన్ను గురువుగా పూజిస్తోంది..
నాకు తోడు నీడగా
నిలిస్తోంది 'ఛాయ' !

- మధుపాళీ
9949700037



### ప్రకృతి రక్షణమే జీవయోగం

సృష్టికి మూలమైన ప్రకృతి
సకల జీవకోటికి రక్షణ కవచం
జాతి మనుగడకు జీవనాధారం
సూర్యోదయ కాంతుల వెలుగులు
పచ్చని వనాల పరిమళాలు
ప్రవహించే నదుల పరవళ్ళు
హిమగిరుల శ్వేత సౌందర్యాలు
సెలయేటి గలగల స్వరాలు
విహంగాల కిలకిల రావాలు
ప్రకృతి మానవాళికి ప్రసాదించిన
అమూల్యమైన వరాలు
ప్రతి మనిషినీ అణువణువునా
పులకరింపజేసే
సహజ సౌందర్య సంపదలు
అయితే నేడు మనిషి చేస్తున్నదేమిటి..
ప్రకృతి ధ్వంసం..జీవకోటికి అనర్థం..!
కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన
ప్రకృతి సోయగాలనే కాలరాస్తూ
"అభివృద్ధి" పేరుతో పరుగులు తీస్తూ
వాటి మూలాలనే నాశనం చేయడం..
చెట్టుచేమలను నరికి,
అడవుల్ని అంతమొందిస్తూ
పచ్చదనాన్ని పాడుచేయడం..
పుడమి గర్భాన్ని నిలువునా చీల్చివేసి
వనరులన్నింటినీ దోచుకోవడం..
ప్లాస్టిక్ మయమైన జీవనంతో
పర్యావరణాన్ని విషతుల్యం చేయడం..
పచ్చిక బయళ్ళను చెరిపేసి
కాంక్రీట్ జంగిల్స్ గా మార్చేయడం..
స్వార్థమే పరమావధి అయిన మనిషి
నేడు సాగిస్తున్న విధ్వంసక చర్యలు?!
వరదలు-అతివృష్టి, అనావృష్టులు...
తుఫాన్లు-ఉష్ణతరంగాలు
విపత్కర రూపంలో విరుచుకుపడుతున్నా
జీవజాతికి ప్రళయాల్ని సృష్టిస్తున్నా
ప్రకృతి ఉనికినే భంగపరుస్తున్నా
మనిషి మారడంలేదు..
ప్రకృతి తత్వం తెలుసుకోవడం లేదు..!
ఓ మనిషీ..
ఇకనైనా మేలుకొని
ప్రకృతిని పట్టించుకో
పరిరక్షణకి పూనుకో
ప్రకృతి రక్షణమే జీవయోగం
అని తెలుసుకో?!!

-పి.వి.ప్రసాద్
9440176824

### కల్తీ మనిషి

పిండి కొద్దీ రొట్టె
తిండి బట్టి రోగాల తుట్టె
అందముగా అంగట్లో అమ్మేది
శుచి లేని రుచి తో మింగేది
జీవశక్తులను నిర్వీర్యం చేసేది
అరచేతిలో స్వర్గం చూపేది
మసి పూసి మారేడు కాయ చేసేది
దవాఖానాలు పెంచేది
అప్పులు చేయించేది
ఆత్మహత్యలను ప్రేరేపించేది
కోర్టులకు పరుగెత్తించేది
జైలు ఊచలు లెక్క బెట్టించేది
కాలుష్యమునకు పురుడు పోసేది
మానవత్వం మంట గల్పేది
స్మశానానికి మోసుకొని పోయేది
బోల్తా కొట్టించే కల్తీ మనిషి

-పూసాల సత్యనారాయణ
9000792400



## గాయని అరుణ్‌రామ్‌కు స్వరమణి పురస్కారం



అరుణారామ్‌కు బిరుదు ప్రదానం చేస్తున్న అతిథులు.

హైదరాబాద్, జూన్ 24: సెవెన్ హిల్స్ సాంస్కృతిక సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ యాదిలో భాగంగా ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి పలువురిని ఆకట్టుకుంది. గాయనీమణులు షాలిని, సాయిపావని, లక్ష్మిపియాశ్రీ, మాధవి, ఏడు కొండలు ఆలపించిన మధుర గీతాలు రంజింపచేశాయి. కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు ముఖ్య అతిథిగా పాల్గొని గాయని అరుణారామ్‌ను సత్కరించి **స్వరమణి బిరుదు** ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వడ్లకొండ వెంకట్రావు, సెవెన్ హిల్స్, సాంస్కృతిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఏడు కొండలరావు, కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.


## ఘనంగా 'అక్షరాల అలువ' కవి సమ్మేళనం




పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, జూన్ 24: తెలంగాణలో పీర్ల పండుగ (మొహర్రం) మత సామరస్యానికి, నబ్బంద వర్గాల ఐక్యతకు నిలువెత్తు ప్రతీక అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో.. 'అలాయి బలాయి కవుల వేదిక' 'నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక' సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలోని పైడి జయరాజ్ హాల్‌లో **'అక్షరాల అలువ'** కవి వనపట్ల సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభకు దేశపతి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనుషులంతా ఒక్కటై ఆడిపాడుకునే అద్భుత సంస్కృతి పీర్ల పండుగ అని కొనియాడారు. 'అలాయి బలాయి' కవితా పత్రం ఆవిష్కరణ ఈ వేడుకల్లో భాగంగా పీర్ల పండుగ మొహర్రంపై ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్య రాసిన అలాయి బలాయి దివ్య కవితనాన్ని పరిశోధకులు, డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ ఆవిష్కరించారు. సభలో విశిష్ట అతిథులుగా పాల్గొన్న ప్రముఖ కవి గోరటి వెంకన్న, యాకూబ్, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, కొల్లాపురం విమల, జిలుకర శ్రీనివాస్, పసునూరి రవీందర్ తదితరులు ప్రసంగిస్తూ.. మనుషుల మధ్య బంధాలను, సామరస్యాన్ని పెంచే ఇలాంటి సాంస్కృతిక ముద్రను భావితరాలకు, విస్తరించాలని ఉద్ఘాటించారు. అలరించిన కవితా గానం ప్రముఖ కవులు సైదాబాబా, బడేసాబ్ సమక్షంలో కవి సమ్మేళనం సాగింది. వీరీల వైభవాన్ని స్మరిస్తూ, 'అక్షరాల అలువ'ను కొనియాడుతూ పలువురు కవులు తమ కవితలను వినిపించారు. కవితా గానం చేసిన వారిలో డా॥నాళేశ్వరం శంకరం, కందుకూరి శ్రీరాములు, మెర్సీ మార్గరెట్, భాజా అఫ్రిది, సిద్ధార్థ వనునూరి రవీందర్, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, ఒద్దిరాజు ప్రవీణ్, మడివల్లి రాజ్‌కుమార్ బెల్లంకొండ సంపత్‌కుమార్, తలారి సతీష్ కుమార్, చెమన్ సింగ్, సుంకర రమేష్, ఉప్పరి తిరుమలేష్, కాంచనపల్లి, కల్వకోలు మద్దిలేటి, తులా శ్రీనివాస్, ఎదిరెపల్లి కాశన్న, అవని శ్రీ ఇంద్రావత్ రాహుల్ నాయక్, రేఖ పావని తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ అబద్ధం కాదు



-బి.ఎస్.రాములు
సెల్:8331966987

పెళ్లి అబద్ధం కాదు
ఆత్మీయంగా అరమరికలు లేకుండా సాగిన
కాపురం అబద్ధం కాదు
మా ప్రేమకు గుర్తుగా పుట్టు కొచ్చిన పిలల్లు
అబద్దం కాదు
మొక్కలను పెంచినట్టు
ఒడిలో ప్రేమతో పెంచినది అబద్ధం కాదు.
పిల్లలు ఎదిగి మమ్మల్ని దాటి
ముందుకు వెళ్లింది అబద్ధం కాదు
అంతా నాదే సాగాలి అతనన్నది అబద్ధం కాదు
తెలియనపుడు సరేనన్నా
తెలిసిన తరువాత నీది తప్పు అనడం తప్పు కాదు
ఒక్క మాటా వినడు
అంతా నాదే సాగాలంటే
ఎట్లా?
సంసారమన్నాక సరే అంటూ
చెరికొంత సర్దుకు పోవాలి కద!
ఆ మాటే ఆయనకు నచ్చలేదు
నువ్వు చెప్పింది వినుకుంటూ పడి వుండడానికి
నేను రాయిని కాదు రప్పను కాదు
హృదయమున్న మనిషిని నేను
నీకు తెలివి లేదు అనే మాట ఒక్కటి చాలు
నేను విడాకులు తీసుకోవడానికి
ఇంకా ఎన్నెన్ని మాటలన్నాడో!.
నాకు తెలివి లేక పోతే నన్నెట్ల ప్రేమించాడు
నేనెట్లా ప్రేమించాను.
నా ప్రేమ అబద్ధం కాదు
మా విడాకులు కూడా అబద్ధం కాదు.
విడాకులయ్యాక తెలిసి వచ్చిందంటాడు.
చెరువు నీళ్లు చెరువెనుక పొలాల్లో వచ్చి పడ్డాయి
మల్లా చెరువుల కు ఎట్లా వస్తాయి .
మా ప్రేమ అబద్ధం కాదు
మా కాపురం అబద్ధం కాదు
మా విడాకులూ అబద్ధం కాదు.
మాకు కలిగిన పిల్లలు అబద్ధం కాదు
మా అనుభవాలు అబద్ధం కాదు
నేను అతన్ని వదిలేసాక
అతడు అనుభవించిన కష్టాలు అబద్ధం కాదు
మల్లీ రా! తోడుగా వుండు
అని అడగడం అబద్ధం కాదు.
అన్నిటిలో అతడు చెప్పిందే వేదం అన్నాక
మల్లీ కలవడం దేనికి
ఇపుడిలా జరిగిందని నాకు చింతేమీ లేదు
గుండెల్లో ఏదో బాధ
నా ఒక్క మాటైనా విని వుంటే ఇలా జరిగేది కాదు
అతడి చివరి చూపు కోసం వచ్చాను.
అతని పాదాలకు పాత జ్ఞాపకాలతో నమస్కరించాను
అతని శరీరం పాడెపై కట్టుతాళ్లతో కట్టబడి ఉంది.
అతనిపై తెల్ల ని కొత్త బట్ట చుట్టారు
నిండా పూలలో
అతని అంతిమ యాత్ర బయలు దేరింది
ఎందుకో చివరి సారిగా
రెండు కన్నీటి బొట్లు జల జలా రాలాయి.

# అలరించిన “మహిషాసుర మర్దిని” నృత్య రూపకం



ఆదివారం సాయంత్రం డోంబివలీలోని సర్వేశ్ సభాగృహంలో మహారాష్ట్ర ప్రభుత్వ తెలుగు సాహిత్య అకాడెమి ద్వారా సాహిత్య - సాంస్కృతిక కార్యక్రమం లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గురు గీత రమేశ్ కోలి బృందం ప్రదర్శించిన **“మహిషాసుర మర్దిని”** నృత్య రూపకంలో పాల్గొన్న కళాకారులతో మహారాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు హరీశ్, తెలుగు కార్యక్రమ సమన్వయకులు జగన్ బాబు గంజి, అశోక్ కంటె, డా॥ అంబల్ల జనార్దన్, డోంబివలి వాసాల కిషన్ గురు గీత, విజయభాస్కర్.

## నల్గొండలో సిటీ బస్సుల ప్రారంభం.. బస్టాండ్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన



నల్గొండ,జూన్ 24: నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, ఆధునికీకరణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని అభివృద్ధి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా నల్గొండ నగరంలో ప్రజల రవాణా సౌకర్యాల కోసం ఏర్పాటు చేసిన రెండు సిటీ బస్సులను మంత్రి ప్రారంభించారు. నగర ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.

కార్యక్రమంలో నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ప్రజాపాలన నివేదిక జిల్లా ప్రత్యేక అధికారి గౌరప్పల్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE M.A.C.T-CUM-XII ADDL CHIEF JUDGE: CITY CIVIL COURT AT SECUNDERABAD**

M.V.O.P.NO.298 OF 2025

**Between:**

Mr.M.Swapna and another

….Petitioners

**AND**

Mr.M.Sridhar and another

..Respondents

Mr. Munnur Sridhar S/o. M. Pentappa, Age:Major, Occ: Rider of Bike bearing No.**TS 07JD 5130**, R/o. Plot No.38, MIG Phase IV Vanasthalipuram, Hyderabad-500070.

.. Respondent No. 1.

Whereas the above named Petitioner filed compensation petition against you and Cholam adalam MS General Insu rance Company Ltd.. for a sum of Rs.20,00,000/- for the accident caused by your vehicle Pulsar Bike bearing No.**TS 07JD 5130**, on 18-06-2024 at Mompet ps limits. The above case is posted to **01-07-2026.** You are here by summon to appear either in person or throu gh pleader with your defence if any at 10.30 A.M. on the above said date before the Hon' ble court, failing which the suit will be heard and determined exparte.

(By Order Of The Hon'ble Court)

**C. Venu Gopal Reddy**
**C. Divya**
Advocate
Off: 2-4-120/18, Swaroop Nagar Uppal, Hyderabad.
Cell: 9440431541


## డ్రైవర్ చాకచక్యంతో తప్పిన పెను ప్రమాదం



తిరుపతి, జూన్ 24: తిరుపతి జిల్లాలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో ప్రమాదం చోటుచేసుకుంది. బ్రేకులు పనిచేయకపోవడంతో ముగ్గురాళ్ల లోడ్‌తో వస్తున్న లారీ అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. అయితే డ్రైవర్ అప్రమత్తతతో ప్రాణాపాయం తప్పింది.

పీలేరు నుంచి తిరుపతి వైపు వస్తున్న లారీ భాకరాపేట ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. వాహనం నియంత్రణ తప్పుతున్నట్లు గుర్తించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమై లారీ నుంచి కిందకు దూకేశాడు.

ఆ తర్వాత లారీ రోడ్డుపై అదుపు కోల్పోయి లోయలోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో లారీలో ముగ్గురాళ్ల లోడ్ ఉన్నట్లు తెలుస్తోంది. అదృష్టవశాత్తూ డ్రైవర్ సకాలంలో బయటకు దూకడంతో ప్రాణాలతో బయటపడ్డాడు.

ఘటన సమాచారం అందుకున్న పోలీసులు, స్థానిక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. లారీ లోయలో పడిపోవడంతో కొంతసేపు ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## డీఏపీ ఎరువు అందించాలి.. రాహుల్, రేవంత్‌కు సెల్ఫీలతో రైతుల వినతి

ఆదిలాబాద్, జూన్ 24:ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు తక్షణమే సరిపడా డీఏపీ ఎరువులు అందించాలని కోరుతూ నిర్మల్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే) గ్రామ రైతులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. బుధవారం ముక్రా(కే) మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి ఆధ్వర్యంలో రైతులు తమ పంట చేనుల్లో సెల్ఫీలు దిగి వాటిని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపించారు.

ఈ సందర్భంగా గాడ్గే మీనాక్షి మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు పత్తి, సోయాబీన్ పంటల సాగుకు సిద్ధమయ్యారని, అయితే మార్కెట్లో డీఏపీ ఎరువులు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పత్తి, సోయాతో పాటు ఇతర పంటలకు కూడా డీఏపీ అవసరమని, కానీ రైతులకు అది దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

డీఏపీ గురించి వ్యవసాయ అధికారులను ప్రశ్నిస్తే, దానికి బదులుగా 20-20-0-13 ఎరువును వాడాలని సూచిస్తున్నారని తెలిపారు.

అయితే డీఏపీతో పోలిస్తే ఆ ఎరువు ధర సుమారు రూ.1,000 వరకు ఎక్కువగా ఉండటంతో రైతులపై అదనపు భారం పడుతోందన్నారు.

గతంలో రైతులకు అవసరమైన మేరకు డీఏపీ, యూరియా ఎరువులు అందుబాటులో ఉండేవని, ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ అడిగినా డీఏపీ లేదనే సమాధానం వస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎలాంటి లింక్ విధానం లేకుండా రైతులకు సరిపడా డీఏపీ ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. డీఏపీతో పాటు ఇతర ఉత్పత్తులను బలవంతంగా కొనుగోలు చేయించే లింక్ విధానం అమలు చేస్తే రైతులపై మరింత ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని ఆమె కోరారు.



# అవయవ దానాలపై అవగాహన అవసరం

సమకాలీన వైద్యశాస్త్రం సాధించిన అద్భుతమైన ఆవిష్కరణ అవయవ మార్పిడి పద్ధతి. అవయవ మార్పిడి ద్వారా దాతల శరీరం నుంచి సేకరించిన అవయవాలను అవయవ లోపాలతో బాధపడుతున్న రోగులకు అమర్చి, వారికి స్వస్థత కలిగించే విధానం నానాటికీ పురోగతి సాధిస్తున్నది. అవయవ దాతల సంఖ్య కూడా అవసరాలకు తగినంతగా కాకపోయినా, నెమ్మదిగా అధికం అవుతున్నది. అన్ని దానాల కన్నా అవయవ దానం గొప్పదనే నగ్న సత్యాన్ని దాతలు అర్థం చేసుకుంటున్నారు.

మానవుడు మృతి చెందాకే శరీరం నుంచి అవయవాలు సేకరిస్తారు కనుక, చనిపోయాక కూడా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపే సదావకాశాన్ని అవయవదానం కల్పిస్తు న్నదన్న వాస్తవం గురించి అవగాహన దాతలకు ఏర్పడుతున్నది. దాతల మరణంతో వారి వారి శరీరాలతో పాటే శరీర అవయవాలు కనుమరుగు కాకుండా, వారి అవయవాలు ఇతరులకు ఉపయోగ పడడంలో, అంతకు మించిన తృప్తి మరొకటి ఉండదు. ఈ పరమ సత్యాన్ని గ్రహించి, ప్రస్తుతం ఎందరో తమ అవయవాలకు దానం చేయడానికి ముందుకొస్తున్నారు. ఈ అవగాహన పెంచేందుకే జూన్ 25న ప్రపంచ అవయవదాన మార్పిడి దినోత్సవం జరుపుకొంటారు.

అవయవ మార్పిడితో ఎవ్వరైనా కొత్త జీవితాన్ని తిరిగి పొందే అవకాశం ఉంటుంది. మరణించిన వ్యక్తి జీవితం అక్కడితో ఆగకుండా, మరణించిన వ్యక్తి మరికొంత మందికి ప్రాణమిచ్చి జీవిస్తూనే ఉన్నాడు.

ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులకు అవయవ దానాలను అమర్చి వారి ప్రాణాలను కాపాడు తున్నారు. అవయవ మార్పిడి వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడటం సాధ్యం అవుతుంది.

కళ్లు, మూత్ర పిండాలు, ఊపిరి తిత్తులు, చర్మం, ఎముక, గుండె కవాటాలు, కార్నియో, సిరలు ఇలా ఎన్నో అవయవ దానాల వల్ల మార్పిడి చేయవచ్చు. బ్రెయిన్‌డెడ్ అయ్యేవారి శరీరాలను వెంటనే దానం చేస్తే ఇతరులకు అమర్చవచ్చు. ఒక్కదాతతో 8 మంది ప్రాణాలను రక్షించవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం 5 లక్షలకుపైగా ప్రజలు వారి ముఖ్య అవయవాల వైఫల్యం కారణంగా మరణిస్తున్నట్లు ఓ నివేదిక తెలుపు తున్నది. కాలేయ వ్యాధి కారణంగా 2లక్షల మంది మరణిస్తున్నారు. గుండె జబ్బుల కారణంగా 50,000 మంది గుండెలు ఆగి పోతున్నాయి. అంతే కాకుండా, 1.5లక్షల మంది కిడ్నీ మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారు, కాని వారిలో 5,000 మందికి మాత్రమే దాతల సహకారం లభిస్తున్నది.

బతికున్నప్పుడు కూడా కొన్నింటిని దానం చేయొచ్చు..కిడ్నీ, ఎముకమజ్జ, రక్తం, కాలేయంలో కొంత భాగం, ఊపిరి తిత్తుల్లో కొంతభాగం, పాంక్రియాస్ లో కొంతభాగం ఇవ్వొచ్చు. అయితే ఇందులో ఎవరెవరికి ఏవేవీ అమరుతాయో వాటిని మాత్రమే వైద్యులు అమర్చడానికి నిర్ణయిస్తారు. రక్తం గురించి... అది వారి గ్రూపులను బట్టి ఏ వ్యక్తికి సరిపోతుందో వారికే దానం చేస్తారు. ఎముకమజ్జ, కాలేయం, ఊపిరితిత్తులు వంటివి కొన్ని రక్త సంబంధీకులకు చాలా పనికొస్తాయి.

సహజ మరణం చెందిన వ్యక్తిలో పనికొచ్చే అవయవాలు..కళ్లు, గుండె వాల్వ్ లు, చర్మం, ఎముకలు, కార్టిలాజ్, నరాలు.

అదే బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తిలో పనికొచ్చే అవయవాలు..కిడ్నీలు, కాలేయం, ఊపిరితిత్తులు, పాంక్రియాస్, చిన్నపేగు, స్వరపేటిక, చేతులు, యుటెరస్, అండాలు, కళ్లు, చర్మం, ఎముకలు, కార్టిలాజ్, నరాలు, కాలి వేళ్లు, చేతి వేళ్లు, మధ్య చెవి ఎముకలు.


అవయవాలు అమర్చేందుకు ఎంత సమయం పడుతుందంటే..

ఊపిరి తిత్తులు, గుండె 6 గంటలలోపు, మూత్రపిండాలు 48 గంటల లోపు, నేత్రాలు 4 గంటలలోపు, కాలేయం 12 గంటల లోపు, క్లోమం 24 గంటల లోపల సమయం కావాలి.

ఆరోగ్యవంతంగా ఉన్న ప్రతి ఒక్కరూ అవయవ దానాలు చేయొచ్చు. వయస్సు, ఆరోగ్యం, జాతితో సంబంధం లేకుండా అందరూ తమను తాము అవయవ కణజాల దాతలుగా భావించవచ్చు. దాతగా ఉండటానికి...వయసు ఏదైనా కొత్తగా పుట్టినవారు, సీనియర్ సిటిజన్లు కూడా అవయవ దాతలు కావచ్చు. అనారోగ్యంతో ఉన్న వ్యక్తి కూడా మరణం తరువాత అవయవాలను లేదా కణ జాలాలను దానం చేయ గలుగుతారు. వైద్యులు అవయవాలను పరిశీలించి, దానం చేయడానికి తగినదా కాదా అని నిర్ణయిస్తారు.

స్వచ్ఛంధ సంస్థలు, కొంత మంది అభ్యుదయ వాదులు మాత్రమే అవయవాలను దానం చేసేందుకు ముందుకు వస్తున్నారు. ప్రజల్లో ఇంకా చైతన్యం, అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. అవయవ దానాలు, వాటి మార్పిడిలపై ప్రభుత్వాలు, స్వచ్ఛంధ సంస్థలు ఇంకా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జూన్ 25...ప్రపంచ అవయవదాన మార్పిడి దినోత్సవం



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# త్రినాథరావుకు కళాకర్ణ బిరుదు ప్రదానం



త్రినాథరావుకు కళాకర్ణ బిరుదును ప్రదానం చేసి సన్మానిస్తున్న అతిథులు.

హైదరాబాద్, జూన్ 24: ప్రముఖ గాయకుడు, ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావుకు కళాకర్ణ బిరుదు, ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో కళారవిందం సంస్థ ఆధ్వర్యంలో జరిగిన గాన విభావరి కార్యక్రమంలో త్రినాథరావును హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ గ్రంథి భవానిప్రసాద్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రినాథరావు ఓవైపు బ్యాంకు అధికారిగా సమర్థవంతంగా పని చేస్తూనే గాన రంగంలో గొప్పగా రాణించారని అన్నారు. రిటైర్ అయిన తర్వాత కూడా తనవంతు సేవలు అందించడం విశేషం అన్నారు. కార్యక్రమంలో దైవజ్ఞ శర్మ, వంశీ రామరాజు, రామ్ కుమార్, మదిపట విశ్వనాథ్, కిన్నెర రఘురాం తదితరులు పాల్గొన్నారు.

# శంకర నారాయణ శతకాల్లో విజ్ఞానంతో పాటు వినోదం



పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, జూన్ 24: తిరుపతి వెంకట కవుల్లో ఒకరైన చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిపై సీనియర్ జర్నలిస్ట్ శంకర నారాయణ జనరంజకంగా శతకం రాశారని త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అన్నారు. చెళ్లపిళ్ల శతకం గ్రంథాన్ని త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనార్ధన మూర్తి మాట్లాడుతూ శంకర నారాయణ ఇప్పటికి 47 శతకాలు రాశారని, వీటిలో వినోదంతో పాటు విజ్ఞానం ఉంటుందని పేర్కొన్నారు. వెంకటశాస్త్రి జీవితాన్ని, సాహిత్య కృషిని ఈ శతకంలో పాఠకులను ఆకట్టుకునేలా శంకర నారాయణ రాశారని తెలిపారు. కవి, గాయకుడు రాయారావు విశ్వేశ్వరరావు పుస్తకాన్ని సమీక్షించి మాట్లాడుతూ పండితులనే కాకుండా పామరులను సైతం తమ పద్యాలతో అలరించిన కవుల గురించి శంకర నారాయణ శతకం రాయడం విశేషమన్నారు. శంకర నారాణ మాట్లాడుతూ తన హాస్య రచనలకు చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి స్ఫూర్తిప్రదాత అన్నారు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి సొంత గ్రామమైన కడియంలో ఆయన పేరిట సాహిత్య పురస్కారాన్ని గత డిసెంబర్ 15న తనకు ప్రదానం చేశారని తెలిపారు. సూరంపూడి శ్రీమణి తదితరులు పాల్గొన్నారు.

# “మహబూబ్ నగర్ జిల్లా బడిపిల్లల కథలు” ఆవిష్కరణ



మహబూబ్ నగర్ జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు రాసిన “ మహబూబ్ నగర్ జిల్లా బడిపిల్లల కథలు “ కథల సంకలనాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆవిష్కరించారు. జూన్ 22 న కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు రాసిన కథలు చాలా చక్కగా ఉన్నాయని ప్రశంసించారు. విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలను ఆవిష్కరించడానికి ఇలాంటి రచనలు దోహదపడుతాయన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల అనుభవాలు, ఆలోచనలతో ఈ పుస్తకం రూపుదిద్దుకుందన్నారు. చిన్నారుల్లో పఠనాసక్తిని పెంపొందించడానికి ఈ కథలు ఉపయోగపడుతాయన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ విద్యార్థులను ప్రోత్సహిస్తే వారిలో ఉన్న నైపుణ్యాలను వెలుగులోకి వస్తాయన్నారు. జిల్లా కలెక్టర్ సహాయ సహకారాలతో ఈ పుస్తకం వెలుగు చూసిందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ హరిప్రియ, జెడ్పీ సి.ఇ.ఓ. వెంకట్ రెడ్డి, ఎ.ఓ.సువర్ణ రాజ్, వ్యవసాయ శాఖ ట్రేనింగ్ సెంటర్ డి.డి. వేంకటేశ్ ఎ.ఎం.ఓ. దుంకుడు శ్రీనివాస్, సి.ఎం.ఓ. సుధాకర్ రెడ్డి, జి.సి.డి.ఓ. అస్రాఖాద్రి, పుస్తక సంపాదకులు డా.భీంపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.






## సత్తుపల్లిలో కేటీఆర్‌కు ఘన స్వాగతం

ఖమ్మం, జూన్ 24:మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుకు (కేటీఆర్) బుధవారం సత్తుపల్లిలో ఘన స్వాగతం లభించింది.

మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావుతో కలిసి ప్రత్యేక హెలికాప్టర్‌లో సత్తుపల్లి చేరుకున్న కేటీఆర్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి పట్టణంలో నిర్వహించనున్న ఓటరు సవరణ ప్రక్రియపై అవగాహన కార్యక్రమానికి ర్యాలీగా బయలుదేరిన కేటీఆర్, మార్గమధ్యలో బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేటీఆర్ రాకతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.